కీళ్ల సమస్యలకు రీ జనరేటివ్ మెడిసిన్‌తో చెక్

- మొదటి, రెండు దశల్లో గుర్తించడం అత్యంత కీలకం
- ప్రముఖ ఆర్థో వైద్య నిపుణులు డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ - 6లో



డాక్టర్ రమణ

రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిట

నేటి నుంచి భూముల విలువ పెంపు

ఇప్పటికే పూర్తయిన లావాదేవీల రిజిస్ట్రేషన్‌కు కక్షిదారుల క్యూ

- రాత్రి పదింటి వరకూ కొనసాగిన ప్రక్రియ
- గత రెండు రోజుల్లో 1,534 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్
- గురువారం 663, శుక్రవారం 871...



శుక్రవారం కిటకిటలాడుతున్న సూపర్ బజార్ వద్ద రిజిస్ట్రార్ కార్యాలయం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం సవరించిన (పెంచిన) భూముల విలువలు శనివారం నుంచి అమలులోకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో తక్కువ ధరలతో చేసుకున్న ఒప్పందాలను రిజిస్టర్ చేసుకోవడానికి కక్షిదారులు శుక్రవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు క్యూ కట్టారు. జనవరి 31వరకే ప్రస్తుత ధరలు ఉంటాయని, ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి కనీసం 20 శాతం పెరుగుతున్నాయని తెలియడంతో అంతా వారం రోజుల ముందు నుంచే రిజిస్ట్రేషన్స్‌కు ఏర్పాట్లు చేసుకున్నారు. బుధవారం అమావాస్య రావడంతో చాలామంది ఆగిపోయారు. ఎదురు అమావాస్య అని మంగళవారం కూడా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లలేదు. దాంతో గురు, శుక్రవారాల్లో రద్దీ పెరిగిపోయింది.

జిల్లాలో తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా అన్నిచోట్ల ఈ రెండు రోజుల్లో రెట్టింపు డాక్యుమెంట్లు రిజిస్టర్ అయ్యాయి. ఉదాహరణకు ద్వారకా నగర్ కార్యాలయంలో రోజుకు సగటున 35 డాక్యుమెంట్లు రిజిస్టర్ అవుతాయి. అయితే గురువారం 87, శుక్రవారం 80 డాక్యుమెంట్లు రిజిస్టర్ చేసినట్టు సబ్ రిజిస్ట్రార్ వెంకట నారాయణ తెలిపారు. అదే విధంగా మధురవాడలో రోజుకు 40 డాక్యుమెంట్లు రిజిస్టర్ అవుతుంటాయి. గురువారం 92, శుక్రవారం ఏకంగా 123 రిజిస్టర్ అయినట్టు అక్కడి సబ్ రిజిస్ట్రార్ చక్రపాణి తెలిపారు. ఆనందపురంలో ... మిగతా 4వ పేజీలో

వ.సం.	సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం	గురువారం డాక్యుమెంట్లు	రెవెన్యూ (రూ.లలో)	శుక్రవారం డాక్యుమెంట్లు	రెవెన్యూ (రూ.లలో)
1.	ఆనందపురం	58	82,67,185	98	2,58,51,632
2.	భీమునిపట్నం	57	3,55,58,527	80	94,53,150
3.	ద్వారకానగర్	87	1,19,43,930	89	1,11,20,925
4.	గోపాలపట్నం	41	75,10,775	46	73,81,682
5.	గాజువాక	53	1,62,82,000	98	84,14,000
6.	పెదగంట్యాడ	92	1,37,35,388	98	1,26,47,305
7.	పెందుర్తి	75	1,28,78,085	92	1,27,12,255
8.	మధురవాడ	92	3,18,42,680	123	5,33,89,061
9.	ఆర్.ఒ.(ఒబి)విశాఖ	108	4,34,11,914	147	3,46,85,000
	మొత్తం	663	18,14,30,484	871	17,56,55,010

ఇవీ కొత్త విలువలు

- అక్కయ్యపాలెం, నరసింహనగర్, అబిద్ నగర్‌లలో గతంలో గజం రూ.70 వేలు ఉండగా రూ.76 వేలకు పెంచారు.
- అడవివరం సింహగిరి కాలనీలో గజం రూ.20 వేలు కాగా రూ.23 వేలు చేశారు.
- నాయుడుతోటలో గజం రూ.24 వేలు ఉండగా, రూ.27 వేలకు పెంచారు. .
- చీమలాపల్లిలో గజం రూ.12 వేలు ఉండగా దానిని రూ.13,500 చేశారు.
- పీఎంపాలెం క్రికెట్ స్టేడియం ఎదురుగా ఎంవీవీ సిటీ ప్రాంతంలో గజం స్థలం రూ.40 వేలు కాగా రూ.44 వేలు చేశారు.
- మధురవాడ వుడా రెవెన్యూ లేఅవుట్‌లో గజం ధర రూ.45 వేలు ఉండేది. ఇప్పుడు రూ.55 వేలు చేశారు.
- చంద్రపాలెంలో గజం ధర రూ.30 వేలు ఉండగా, రూ.33వేలకు పెంచారు.
- బక్కన్నపాలెంలో గజం రూ.20 వేలు కాగా రూ.24వేలు చేశారు.
- కొమ్మాదిలో గజం రూ.18 వేల నుంచి రూ.21వేలకు పెంచారు.
- పెద రుషికొండలో గజం రూ.22 వేలు ఉండగా రూ.30 వేలు చేశారు.
- ముడసర్లోవ ప్రాంతంలోని కృష్ణాపురం, పైనాపిల్ కాలనీ ఏరియాల్లో గజం ప్రభుత్వ ధర రూ.14 వేలు ఉండగా బాగా తక్కువగా ఉందని 20వేలు చేశారు.

మార్కెట్ విలువలన్నీ ప్రాంతాన్ని బట్టి కాకుండా ఇంటి నంబరును బట్టి మారతాయి. నివాసమైతే ఒక రేటు, వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తే మరో రేటు ఉంటుంది.

సిబ్బంది తగ్గాలట, ఉత్పత్తి పెరగాలట!

ఉక్కుపై పాలకుల వింత లెక్కలు

- వీఆర్ఎస్‌కు 1,594 మంది వరకూ దరఖాస్తు
- సంవత్సరాంతంలోగా మరో 1,200 మంది పదవీ విరమణ
- 30 శాతం మేర కాంట్రాక్టు కార్మికుల తగ్గింపునకు ఆదేశాలు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'తక్కువ తినండి...ఎక్కువ పనిచేయండి' అనే రీతిలో విశాఖపట్నం స్టీల్ ప్లాంటు యాజమాన్యం వ్యవహరిస్తోంది. ఓ వైపు శాశ్వత ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు కార్మికులను భారీగా తగ్గించేస్తూ మరోవైపు 100 శాతం ఉత్పత్తి సాధించాలని ఆదేశిస్తోంది. జీతాలు నెల నెలా ఇవ్వలేమని, అయినా సరే పూర్తిస్థాయి ఉత్పత్తి తీయాలని చెబుతోంది. కేంద్ర ఉక్కు శాఖా మంత్రి కుమారస్వామి పర్యటన తరువాత ప్లాంటులో దీనిపైనే చర్చ జరుగుతోంది.

ఉత్పత్తి వ్యయాల తగ్గింపు పేరుతో ఉద్యోగుల సంఖ్యను కుదిస్తున్నారు. ఇందులో హేతుబద్ధత కనిపించడం లేదు. శాశ్వత ఉద్యోగులను తగ్గించుకోవడానికి స్వచ్ఛంద పదవీ విరమణ పథకం (వీఆర్ఎస్) ప్రకటించారు. దానికి గడువు జనవరి 31 (శుక్రవారం రాత్రి)తో ముగిసింది. రాత్రి ఏడు గంటల సమయానికి మొత్తం 1,594 దరఖాస్తులు అందాయి. అవసరమైన ముడి పదార్థాలు ఇవ్వకుండా పూర్తి ఉత్పత్తి తీయమనడం, సిబ్బందిని తగ్గించడంతో పని ఒత్తిడి పెరిగింది. అంత కష్టపడినా జీతాలు ఇవ్వడం లేదు. దాంతో వీఆర్ఎస్‌కు ఎక్కువ మంది మొగ్గు చూపారు. ఉక్కు ఉత్పత్తిలో అత్యంత కీలకమైన బ్లాస్ట్ ఫర్నేస్‌లు, స్టీల్ మెల్టింగ్ షాపులు, కోక్ ఓవెన్, సింటర్ ప్లాంట్లు, రోలింగ్ మిల్స్ విభాగాల్లో పదుల సంఖ్యలో వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేశారు. వీరు బయటకు వెళ్లిపోతే ఆయా విభాగాలపై తీవ్రమైన ప్రభావం పడుతుంది. ఇదిలావుండగా నెలకు సగటున వంద మంది చొప్పున ఉద్యోగులు పదవీ విరమణ చేస్తున్నారు. దాంతో డిసెంబరు నెలాఖరుకు మరో 1,200 మంది తగ్గిపోతారు. కొత్తగా రిక్రూట్‌మెంట్ లేకుండా తక్కువ సిబ్బందితోనే ముందుకు వెళితే...తీవ్రమైన పరిణామాలు ఎదుర్కొనాల్సి వస్తుందని ఉద్యోగ వర్గాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. ఇటీవల సింటర్ ప్లాంటులో జరిగిన మాదిరిగానే ఇతర విభాగాల్లో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, యాజమాన్యం ఈ విషయం గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని హెచ్చరిస్తున్నారు. సింటర్ ప్లాంటులో కన్వేయర్ బెల్ట్‌పై వ్యర్థాలు టన్నుల కొద్దీ పేరుకుపోవడం వల్ల డక్ట్ కూలిపోయి, ఉత్పత్తికి కొన్ని రోజులు ఆటంకం కలిగింది. పునరుద్ధరణకు కోట్ల రూపాయల వ్యయం అయింది.

కాంట్రాక్టు కార్మికుల తగ్గింపులో కనిపించని హేతుబద్ధత

ప్లాంటులో 14 వేల మంది కాంట్రాక్టు కార్మికులు ఉన్నారు. వారిని 30 శాతం తగ్గించాలని ప్రయత్నిస్తున్నారు. కాంట్రాక్టు గడువు ముగిస్తే వాటిని రెన్యువల్ చేయడం లేదు. వారికి పాస్‌లు ఇవ్వడం లేదు. తాజాగా వేయి మంది కాంట్రాక్టు ... మిగతా 4వ పేజీలో

పేదలకు ఉపశమనం

ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణల క్రమబద్ధీకరణకు కూటమి సర్కారు గ్రీన్‌సిగ్నల్

150 గజాల వరకు ఉచితం

- జిల్లాలో సుమారు 25 వేల మందికి ప్రయోజనం
- త్వరలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన పట్టాలకు తాజాగా కన్వేయన్స్ డీడ్‌ల పంపిణీకి చర్యలు

విశాఖపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి):

అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో పేదల ఆక్రమణలను క్రమబద్ధీకరించేందుకు అవకాశం కల్పిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత టీడీపీ హయాంలో విశాఖలో సుమారు 50 వేల మంది పేదలకు పట్టాలు జారీచేసిన విషయం తెలిసిందే. తాజా నిర్ణయం మేరకు 150 గజాల వరకూ ఉచితంగా క్రమబద్ధీకరించనున్నారు. అంతకంటే ఎక్కువ ఆక్రమిత స్థలాలుంటే నిబంధనల మేరకు ఫీజులు చెల్లించి క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పిస్తారు. అయితే 2019 అక్టోబరు 15వ తేదీ కంటే ముందు స్థలాలను ఆక్రమించుకున్న వారు మాత్రమే అర్హులుగా ప్రభుత్వం పేర్కొంది.

తాజా ఉత్తర్వుల మేరకు జిల్లాలో సుమారు 25 వేల మంది ఆక్రమణదారులకు ఊరట కలుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. క్రమబద్ధీకరణకు వీలుగా త్వరలో గ్రామ/వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియ ప్రారంభమవుతుందంటున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ దరఖాస్తుల స్వీకరణకు ఎలాంటి ఇబ్బంది లేదని చెబుతున్నారు. కోడ్ ముగిసిన తరువాత వాటిని పరిశీలించి, అర్హులను నిర్ధారిస్తారని, ఆ తరువాత క్రమబద్ధీకరణ ప్రక్రియ చేపడతారని అధికారులు చెబుతున్నారు.

150 గజాల వరకు ఉచితం

గెడ్డలు, నీటి ప్రవాహ ప్రాంతాలు, చెరువులు మినహా ఇతర ప్రభుత్వ భూముల్లో 2019 అక్టోబరు 15వ తేదీ కంటే ముందుగా స్థలాలను ఆక్రమించుకున్నవారు క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. వీరిలో 150 గజాల వరకు ఆక్రమించుకున్న వారికి ఉచితంగానే క్రమబద్ధీకరిస్తారు. దీంతో పాటు పట్టా రూపంలో కన్వేయన్స్ డీడ్ ఇస్తారు. రెండేళ్ల తరువాత ఆ భూమిపై శాశ్వత హక్కులు కల్పిస్తారు. వీరికి ఎటువంటి రిజిస్ట్రేషన్ ఫీజు ఉండదు. కాగా 151 నుంచి 300 గజాల వరకు ఆక్రమణలకు పాల్పడినవారు భూమి విలువలో 15 శాతం ఫీజు, 50 శాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలి. 301 నుంచి 450 గజాల ... మిగతా 4వ పేజీలో

ఆన్‌లైన్‌లో ఇంటర్ హాల్ టికెట్లు

- ఫిబ్రవరి రెండో వారం నుంచి డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం

మద్దిలపాలెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి):

ఇంటర్ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులంతా ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పిస్తూ ఇంటర్ బోర్డు నిర్ణయం తీసుకుంది. గతంలోలా హాల్‌టికెట్ల కోసం కళాశాలల చుటూ తిరగాల్సిన పనిలేదని వివరించింది. ఈ మేరకు వెబ్‌సైట్ bieap.com నుంచి విద్యార్థులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొంది.

రాష్ట్ర వ్యాప్తంగా ఫిబ్రవరి 5వ తేదీ నుంచి ఒకేషనల్, పదో తేదీ నుంచి జనరల్ విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు హాజరయ్యేందుకు విద్యార్థుల హాల్‌టికెట్లను బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. మార్చి ఒకటో తేదీ నుంచి థియరీ పరీక్షలున్నందున ఈ నెల రెండో వారం నుంచి ఆయా పరీక్షల హాల్‌టికెట్లను అందుబాటులో ఉంచుతామని అధికారులు వెల్లడించారు. పరీక్ష ఫీజు చెల్లించిన ప్రతి విద్యార్థి హాల్‌టికెట్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని తెలిపింది. గతంలో హాల్‌టికెట్లు కళాశాలలకు పంపించి, వాటిపై కళాశాల ప్రిన్సిపాల్ సంతకం ఉంటేనే పరీక్షకు అనుమతించేవారు. దీంతో ప్రైవేటు కళాశాలలు ఫీజు ... మిగతా 4వ పేజీలో

ఉత్సాహంగా ఉత్సవ్

- ఉదయం 5కే రన్
- సాయంత్రం కార్నివాల్
- ప్రధాన వేదికపై గిరిజన నృత్యాల ప్రదర్శన
- పద్మాపురం గార్డెన్స్‌లో పుష్ప ప్రదర్శన



డుడుము కొట్టి అరకు ఉత్సవ్‌ను ప్రారంభిస్తున్న అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేశ్‌కుమార్

అరకులోయ/అనంతగిరి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్రా ఊటీ అరకులోయలో శుక్రవారం అరకు చలి ఉత్సవ్ అట్టహాసంగా మొదలైంది. జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేశ్‌కుమార్ తుడుము కొట్టి ఉత్సవ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. తొలిరోజు ఉదయం యండపల్లివలస నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకూ 5కే రన్‌ను నిర్వహించారు. స్థానిక గిరిజన మ్యూజియం ఆవరణలో ముగ్గులు, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. సాయంత్రం గిరిజన మ్యూజియం వద్ద నుంచి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రధాన వేదిక వరకూ కార్నివాల్ నిర్వహించారు. కార్నివాల్‌లో వివిధ జాతులకు చెందిన గిరిజనులు తమ సంప్రదాయ నృత్యాలు ప్రదర్శించారు. మ్యూజియం ప్రాంగణం వద్ద జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్, జేసీ అభిషేక్ గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ శౌర్యమన్‌పటేల్ డ్యాన్స్ చేసి హుషారెత్తించారు. గిరిజన యువతీ, యువకులు, పర్యాటకులు నృత్యాలు చేస్తూ ఎంజాయ్ చేశారు. కార్నివాల్‌కు విశేష స్పందన ... మిగతా 4వ పేజీలో



పద్మాపురం గార్డెన్స్ వద్ద హాట్ ఎయిర్ బెలూన్

ఆన్‌లైన్ గేమ్స్ ఆడవద్దన్నందుకు తల్లిని హతమార్చాడు

- అతడికి మతిస్థిమితం లేదంటున్న బంధువులు
- మల్కాపురంలో ఘోరం
- హతురాలి భర్త కోస్ట్‌గార్డు కమాండర్



నిందితుడు హనుమాన్‌సింగ్

ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడవద్దని మందలించిందని తల్లినే కడతేర్చాడో యువకుడు. నగరంలోని మల్కాపురంలో గల కోస్ట్ గార్డు ప్రధాన కార్యాలయ క్వార్టర్స్‌లో గురువారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలు... - మెయిన్ 14లో

ఫ్రీ హోల్డ్‌లో అవకతవకలు

ప్రభుత్వానికి జిల్లా యంత్రాంగం నివేదిక

- 8 ఎకరాలకు ఫ్రీ హోల్డ్ అనుమతుల మంజూరులో నిబంధనలు పాటించలేదని గుర్తింపు
- అందులో 7.5 ఎకరాలు మేకల మేత బీడు
- మరో అర ఎకరా రస్తా
- ఆనందపురం రెవెన్యూ అధికారులు లీలలు
- రామవరం, భీమన్నదొరపాలెం, కోలవానిపాలెంలలో ఫ్రీహోల్డ్ అనుమతులపై అనుమానాలు



రామవరంలో ఫ్రీహోల్డ్ చేసిన మేకల మేత బీడు భూములు ఇవే

విశాఖపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి):

వైసీపీ ప్రభుత్వ హయాంలో డీపట్టా భూములకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్ల జారీపై అనేక ఆరోపణలు వచ్చాయి. అప్పటి పాలకుల ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ముందువెనుకా ఆలోచించకుండా అనుమతులు ఇచ్చేశారు. ఇలా... ఆనందపురం మండలం రామవరం రెవెన్యూ పరిధిలో మేకల మేత కోసం గుర్తించిన భూములను ఫ్రీహోల్డ్ చేసేశారు. జిల్లాలో సుమారు 626 ఎకరాల డీపట్టా భూములకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు జారీచేశారు. అందులో 136 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. గత ఏడాది ఎన్నికల ముందు వీటిపై దుమారం రేగడంతో ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్ల జారీ, రిజిస్ట్రేషన్లు నిలిపివేశారు. అయితే ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్ల జారీలో అవకవతకలు జరిగాయని ఆరోపణలు రావడంతో కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. దీంతో జిల్లా యంత్రాంగం రెండు పర్యాయాలు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి నివేదిక పంపింది.

ఆనందపురం మండలం రామవరం సర్వే నంబర్లు 37/6, 12, 14, 15లో 7.5 ఎకరాలు మేకల మేత కోసం రెవెన్యూ అధికారులు అప్పట్లో గుర్తించారు. రెవెన్యూ నిబంధనల మేరకు గెడ్డలు, వాగులు, చెరువులు, రాస్తాలు, ... మిగతా 4వ పేజీలో

రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు

పద్మనాభం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో రబీ పంటలకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఏఓ ఎంపీఎస్ చలం తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బీఆర్ తాళ్లవలస కేంద్రంలో డీఏపీ 150 బస్తాలు, పాండ్రంగిలో యూరియా 100 బస్తాలు ఇప్పటికే సిద్ధంగా ఉండగా, మద్ది కేంద్రానికి 260, బాందేవపురం కేంద్రానికి 260 యూరియా బస్తాలు శనివారం వస్తాయని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పక్కాగా ఎన్నికల కోడ్ అమలు

పద్మనాభం రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని ఎంపీడీవో ఎం. విజయ కుమార్ ఆదేశించారు.శుక్రవారం ఆయన తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడా రాజకీయ నాయకుల చిత్రపటాలు, ఫ్లెక్సీలు ఉండకూడదని చెప్పారు. నేతల విగ్రహాలకు ముసుగు వేయాలన్నారు. కొత్త పనులు ప్రారంభించరాదని, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న రాజకీయ నాయకుల ఫొటోలను కూడా తొలగించాలని ఆదేశించారు.

ఉపాధి కూలీలకు పనిముట్లు ఇవ్వాలి : సీపీఐ

పద్మనాభం రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం కూలీలకు పనిముట్లు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన అనంతవరం, కొవ్వాడ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూలీలకు తక్షణమే పార, గునపం, పలుగు తదితర పనిముట్లు ఇవ్వాలని, పని ప్రదేశంలో టెంట్లు, తాగునీటి సౌకర్యం, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తోందని,అందులో భాగంగానే పథకం ద్వారా మంజూరైన సీసీ రోడ్లు, కాలువల పనులను యంత్రాల ద్వారా చేయిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు ఆ పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

తునివలసలో పశు వైద్య శిబిరం



రైతుకు మిశ్రమ లవణాన్ని అందిస్తున్న దృశ్యం

పద్మనాభం రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) :పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ జిల్లా సంయుక్త సంచాలకుడు డాక్టర్ రామకృష్ణ చెప్పారు. శుక్రవారం తునివలస గ్రామంలో ఆ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశుపోషణ, వాటి సంరక్షణ, ప్రభుత్వ పథకాలు గురించి రైతులకు వివరించారు. అనంతరం వైద్య సిబ్బంది 164 లేగ దూడలకు, 165 గొర్రెలకు.45 కోళ్లకు నట్టల నివారణ మందు వేశారు అలాగే పాడి రైతులకు లవణ మిశ్రమం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకుడు చంద్రశేఖర్, రెడ్డిపల్లి పశు వైద్యాధికారి లక్ష్మణరావు, సుజాత, గోపాలమిత్ర సన్యాసిరావు, సచివాలయ సిబ్బంది సాయితేజ, శ్రీనివాసరావు, ధర్మతేజ, వేణుగోపాలరావు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం శుక్రవారం వైభవంగా జరిగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, ప్రసాదాలను అందజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎండాడ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. పీఎంపాలెం పోలీసుల వివరాలు ప్రకారం..కొమ్మాది వైఎస్సార్ కాలనీలో నివాసం ఉంటున్న దిమిలి సూరిబాబు (43) కార్పెంటర్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిస కావడంతో ఈనెల 28న ఇంటి మెట్లు ఎక్కుతుండగా జారి పడడంతో తలకు గాయమైంది. కుటుంబ సభ్యులు వెంటనే గాయత్రి ఆసుపత్రికి తర లించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్‌కి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు పరమేశ్వరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేశారు.

శరవేగంగా సాగర్‌నగర్ అభివృద్ధి

- పెరుగుతున్న విస్తరణ
- ఆకర్షిస్తున్న ఆహ్లాదకర వాతావరణం
- నివాసాలకు ప్రజల్లో ఆసక్తి
- పదుల సంఖ్యలో బహుళ అంతస్థుల భవనాల నిర్మాణం


బీచ్ రోడ్‌లో బహుళ అంతస్తుల భవన నిర్మాణం

సాగర్‌నగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు పల్లెను తలపించే సాగర్‌నగర్.. ప్రస్తుతం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. గత కొన్నేళ్లుగా ఈ ప్రాంతం శరవేగంగా వృద్ధి చెందుతోంది. 30 ఏళ్ల క్రితం ఈ కాలనీని వుడా నిర్మించింది. అప్పట్లో సాయంత్రం 5 గంటలు దాటితే సాగర్‌నగర్ వైపు రావడానికి భయపడాల్సిన పరిస్థితి ఉండేవి. గంటకు కనీసం ఒక వాహనం కూడా బీచ్ రోడ్డులో కనిపించేది కాదు. పగటి పూట కూడా ఈ మార్గంలో రావడానికి ఒకటికి రెండుసార్లు ఆలోచించేవారు. ఐఎన్ఎస్ కళింగ కోసం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో నిర్మించిన సింగిల్ రోడ్డు మాత్రమే వుండేది. ఒక వైపు కొండలు, మరోవైపు బీచ్ రోడ్డుకు సముద్రానికి మధ్య తీరంలో ఏపుగా పెరిగిన సరుగుడు చెట్లు వుండేవి. కాలనీ నిర్మితం కాకముందు ఆ ప్రాంతమంతా గుడ్లవానిపాలెం పంచాయతీలో వుండేది. అప్పట్లో ఈ భూముల్లో కర పెండ్లం దుంపలు సాగుచేసేవారు. ప్రముఖ సినీ నటుడు చిరంజీవికి మంచి హిట్ ఇచ్చిన ఛాలెంజ్ చిత్రం షూటింగ్ మొత్తం ఇక్కడే జరిగింది.

జీవీఎంసీలో విలీనం తరువాత ప్రగతి

గతంలో ఇక్కడ ఇంటి అద్దెలు ఎల్ఐజీలు రూ. 300, ఎంఐజీలు రూ. 500, హెచ్ఐజీలు రూ. 800 నుంచి రూ. 1000 ఉండేవి. తక్కువ అద్దెకు దొరకడంతో కొంతమంది ఇక్కడ ఇళ్లను అద్దెకు తీసుకుని అసాంఘిక కార్యకలాపాలకు వినియోగించేవారని ప్రచారం జరిగేది. బీచ్ రోడ్డు నాలుగు లైన్లుగా అభివృద్ధి చెందడం, జీవీఎంసీలో ఈ ప్రాంతం విలీనం కావడంతో ప్రగతి మొదలైంది. ముఖ్యంగా ఫ్లోరైడ్ సమస్య పరిష్కారం కావడంతో చాలా మంది ఇక్కడ నివాసానికి ఆసక్తి చూపుతున్నారు. ఆస్తుల విలువ కూడా పెరిగింది.

వేలల్లో ఉండే ఇళ్లు, స్థలాలు లక్షలు, కోట్లకు పెరిగాయి. ఇంటి అద్దెలు కూడా పెరిగాయి రూ. 300 వుండే ఇంటి అద్దె రూ. 5 వేలు అయ్యింది. రూ. 800 వుండే హెచ్ఐజీ అద్దె రూ. 20 వేలు అయ్యింది. రూ. 500 వుండే ఎంఐజీ అద్దె రూ. 8 వేలు అయ్యింది. ఇంటి అద్దెలు చెల్లించలేక కొంత మంది మధురవాడ వైపు వలస వెళుతున్నారు.

పర్యాటకంగానూ వృద్ధి

సాగర్‌నగర్ బీచ్ రోడ్డు మరో ఆర్‌కే బీచ్ రోడ్డుగా మారుతోంది. బీచ్ రోడ్డులో సెంట్రల్ లైటింగ్, కోకో ఏరినా ఏర్పాటు చేసిన తరువాత సందర్శకుల తాకిడి ఎక్కువైంది. గతంలో బీచ్‌రోడ్డులో ప్రయాణించేటప్పుడు ఉడా నిర్మించిన హెచ్ఐజీ ఇళ్లు పాడై బూత్ బంగ్లాలులాగా సందర్శకులకు గోచరించేవి. ఇప్పుడు ఆ ఇళ్లు విద్యుత్ లైటింగ్‌తో ధగధగలాడుతూ గెస్ట్‌హౌస్‌లు, వ్యాపార కూడళ్లుగా మారిపోయాయి. అలాగే గతంలో సీఆర్‌జెడ్ నిబంధనల వల్ల ఐదు అంతస్తులతో కూడిన నిర్మాణాలు జరిగేవి కావు. ప్రస్తుతం సీఆర్‌జెడ్ అనుమతి ఇస్తుండడంతో ఇటీవల బీచ్ రోడ్డుకు ఆనుకుని అంద మైన బహుళ అంతస్తుల భవనాలు కనువిందు చేస్తున్నాయి.

శతాబ్ది ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు

- ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దాలని ప్రభుత్వానికి నివేదిస్తాం
- ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు


విలేకరులతో మాట్లాడుతున్న ఉత్సవ కమిటీ సభ్యులు

భీమునిపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాల నిర్వహ ణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు తెలిపారు.శుక్రవారం ఆయన పాత బస్టాండ్ వద్ద గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉత్సవాలకు మంత్రి లోకేశ్‌ను ఆహ్వానించి పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని విన్నవిద్దామనుకున్నామని, అయితే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వల్ల సాధ్య పడలేదని చెప్పారు. పాఠశాలతో పాటు ఫుట్‌బాల్ గ్రౌండ్, కుమ్మరిపాలెం ఇండోర్ స్టేడియంను అభివృద్ధి చేయాలని ఏకగ్రీవ తీర్మానాలు చేసి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. కమిటీ కార్యదర్శి మైలపల్లి లక్ష్మణరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఉత్సవాల్లో భాగస్వాములై అన్ని విధాలుగా సహకరించడం ఆనందంగా ఉందని తెలిపారు. కమిటీ కన్వీనరు మైలపల్లి షణ్ముఖరావు మాట్లాడుతూ ఉత్సవాలకు దేశ, విదేశాల నుంచి ఎందరో పూర్వ విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. పూర్వ విద్యార్థుల నుంచి ఇప్పటివరకూ రూ. 15 లక్షల విరాళాలు అందాయని తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ కన్వీనర్లు పార్వతీశం, కాళ్ల సన్ని, కంటుభుక్త ముత్యాలరావు, చౌదరి సత్యరాజ్, తట్టికోట భీమారావు, యెచ్చర్ల హరి, పెంటపల్లి దేవానంద్, అత్తిలి సత్యనారాయణ, మారోజు గోపి, దొర, కనకల సన్నిబాబు, పోలిపల్లి నరసింగరావు, మొకర శంకర్ పాల్గొన్నారు.


వేడుకల్లో భాగంగా విద్యార్థినుల నృత్య ప్రదర్శన

గీతంలో ముగిసిన 'జెమ్-25'

సాగర్‌నగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) :వాణిజ్య విద్యను అభ్యసించే విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలతో పాటు క్రీడా, సాంస్కృతిక నైపుణ్యాలను వెలికితీయడానికి గీతం వర్సిటీ బిజినెస్ స్కూల్ మూడు రోజులుగా నిర్వహిస్తున్న గీతం ఎక్సలెన్స్ మీట్ 25 శుక్రవారంతో ముగిసింది. చివరి రోజు కార్యక్రమానికి స్టాక్ ఎక్స్ఛేంజ్ ఉపాధ్యక్షుడు ఎస్. రంగనాథన్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజాఫణి పప్పు మాట్లాడుతూ యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో జెమ్ కన్వీనర్ డాక్టర్ బి. కృష్ణకుమారి, జెమ్ 25 చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్ఎస్ మిశ్రా, జెమ్ కో సీఈఓ కె. చెర్రీహేడెస, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ కె. లుబ్నానిహార్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఉత్సవాల సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

టీడీపీలో చేరనున్న కాకర్లపూడి

ఆనందపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ సీనియర్ నాయకుడు కాకర్లపూడి వరహాలరాజు, ఆయన కుమారుడు శ్రీకాంత్ ఆ పార్టీకి రాజీనామా చేసినట్టు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకర్లపూడి శ్రీకాంత్ వైసీపీ కేంద్ర కార్యనిర్వాహక సభ్యుడిగా పని చేశారు. గత ఎన్నికల్లో పాడేరు నియోజకవర్గం పరిశీలకుడిగా కూడా పని చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు ఆయన అత్యంత సన్నిహితుడు. ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. ఈనెల 5న భీమిలిలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీలో చేరనున్నట్టు వారు ప్రకటనలో పేర్కొన్నారు.


రిటైర్డ్ ఉద్యోగి వరహాలరావును సన్మానిస్తున్న ఈఓ త్రినాథరావు

సింహాచలం దేవస్థానం ఉద్యోగికి సన్మానం

సింహాచలం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : దేవదాయ శాఖలో ఉద్యోగం లభించడం పూర్వజన్మ సుకృతమని సింహాచలం దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు అన్నారు. దేవస్థానంలో 39 ఏళ్లు పనిచేసిన సీనియర్ అసిస్టెంట్ ముగ్గు వరహాలరావు శుక్రవారం స్వచ్ఛంద పదవీ విరమణ చేయడంతో ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో అప్పన్న ఆలయ కల్యాణ మండపంలో ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ పలువురు ఈఓలకు సీసీగా పనిచేసిన వరహాలరావు అటు అధికారుల, ఇటు సిబ్బంది మన్ననలు పొంది మిగతా ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పూర్వపు ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ఇంటర్ హాల్ టికెట్లు

... 3వ పేజీ తరువాయి

బకాయిలున్న విద్యార్థులకు హాల్‌టికెట్లు నిరాకరించేవారు. పరీక్షల ముందు రోజు వరకు ఫీజుల కోసం వేధించడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యేవారు. తాజాగా ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలకు హాజరయ్యే అవకాశం కల్పించారు. హాల్‌టికెట్లపై ఎవరి సంతకాలు అవసరంలేదని, ప్రింట్ తీసుకువస్తే పరీక్షలకు అనుమతిస్తారని అధికారులు తెలిపారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు పుట్టిన తేదీ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పుట్టిన తేదీ లేదా మొదటి సంవత్సరం హాల్‌టికెట్ నంబరు నమోదు చేస్తే హాల్‌టికెట్ డౌన్‌లోడు చేసుకోవచ్చునని వివరించారు.


హైవేలో బైఠాయించి ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

యామినికి న్యాయం చేయాలని ఆందోళన

- జాతీయ రహదారిపై బైఠాయించిన గ్రామస్థులు

తగరపువలస, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని టి.నగరపాలెంకు చెందిన బొట్ట యామినికి న్యాయం చేయాలని ఆ గ్రామస్థులు తగరపువలస గోస్తనీ వంతెన సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం ఆందోళన చేశారు. గ్రామస్థులంతా హైవేపైకి వచ్చి బైఠాయించడంతో ట్రాఫిక్ స్తంభించింది. వెంటనే సీఐ సుధాకర్, ఎస్ఐ హరీష్ సంఘటనా స్థలానికి వచ్చి వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా యామిని మాట్లాడుతూ తన కాపురం బాగుండాలన్న ఉద్దేశంతో తన తండ్రి ఆత్మహత్య చేసుకున్నారని, అతని మృతదేహంతో ఆందోళన చేయగా అత్తింటి వారు పోలీసుల సమక్షంలో తన బిడ్డను నాలుగు రోజుల్లో అప్పగిస్తామని చెప్పారని తెలిపారు. ఇప్పటికి నలభై రోజులైనా బిడ్డను అప్పగించలేదు సరికదా నిందితులకు బెయిల్ ఇచ్చారన్నారు. ఈమేరకు ఆందోళనకారులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అనంతరం పోలీసుల సూచన మేరకు ఆందోళన విరమించారు.

కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు

భీమునిపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్టుకు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధానార్చకుడు వెలవలపల్లి శంకర్‌శర్మ ఆధ్వర్యంలో హోమం, పూజలు జరిగాయి. సాయంత్రం దీపోత్సవం, శ్రీహరి కుసుమాంబ కోలాటం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పూసర్ల శ్రీనివాసరావు, కార్యదర్శి బొండా బాలాజీ, కోశాధికారి ఎంవీజే గుప్తా, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉత్సవ్

... 3వ పేజీ తరువాయి

లభించింది.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

ప్రధాన వేదికపై శుక్రవారం సాయంత్రం ప్రదర్శించిన బస్తార్ బంద్, తోడా, గోండు ట్రైబ్స్ నృత్యం, తప్పెటగుళ్లు, కొమ్ముకోయ, సవర నృత్యం, జాతపు నృత్యం, చెక్క భజన, జముకుపేట, మణిపూర్ సంప్రదాయ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.


పెద్ద చెరువు వద్ద జనసేన నాయకులతో డాక్టర్ రాజేంద్రసింగ్

'చిట్టివలస పెద్ద చెరువును కాపాడుకుందాం'

తగరపువలస, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస పెద్ద చెరువును జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరొందిన పర్యావరణవేత్త డాక్టర్ రాజేంద్రసింగ్ శుక్రవారం సందర్శించారు. రెండో వార్డు జనసేన అధ్యక్షుడు నీలాపు శంకర్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు వారు చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా శంకర్ రెడ్డి మాట్లాడుతూ చెరువు మొత్తం విస్తీర్ణం 36. 40 ఎకరాలు కాగా ఆక్రమణల వల్ల 28 సెంట్లకు తగ్గిందని చెప్పారు. చెరువు అభివృద్ధికి గతంలో రూ. 1.98 కోట్లు మంజూరయ్యాయని, అధికారులు ఇప్పుడు కేవలం రూ.6.50 లక్షలని చెబుతున్నారన్నారు. చిల్లపేట, జీరుపేట, చిట్టివలస ప్రజలు ఆ నిధులు సక్రమంగా వినియోగించాలని కోరుతున్నారన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని రాజేంద్రసింగ్ హామీ ఇచ్చారు.



భీమిలి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యుత్ వెలుగులతో ధగధగలాడుతోంది. శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో పాఠశాల భవనాన్ని జాతీయ జెండా రంగుల లైటింగ్‌తో సుందరంగా అలరించారు. ఇది చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. - భీమునిపట్నం, ఆంధ్రజ్యోతి

పేదలకు ఉపశమనం

... 3వ పేజీ తరువాయి

వరకు భూమి విలువ 100 శాతం, 50 శాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని ప్రభుత్వం పేర్కొంది.

ఇవీ మార్గదర్శకాలు

భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం పలు మార్గదర్శకాలు జారీచేసింది.ఆధార్ కార్డు కలిగి ఉండాలి. గ్రామీణ ప్రాంతంలో కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.2 లక్షలు, పట్టణాల్లో రూ.1.44 లక్షలు మించకూడదు. సొంతంగా కారుంటే క్రమబద్ధీకరణకు అర్హత ఉండదు. అయితే జీవనోపాధికి ట్యాక్సీ వ్యవసాయం కోసం ట్రాక్టర్ సొంతంగా సమకూర్చుకున్నా అనుమతిస్తారు. మెట్ట, మాగాణి కలిసి ఐదెకరాలకు మించకూడదు.అధిక ఆదాయం ఉన్న వారికి కూడా 150 గజాల వరకు ఉచితంగానే క్రమబద్ధీకరిస్తారు. 151 నుంచి 300 గజాల వరకు క్రమబద్ధీకరణ కోరితే భూమివిలువలో 15 శాతం ఫీజు, పూర్తిగా రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. 301 నుంచి 450 గజాల వరకు భూమి విలువలో 200 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజులు అక్కడ ఉన్న ధరల మేరకు చెల్లించాల్సి ఉంటుంది.

25 వేల మందికి ఉపశమనం

నగరంతోపాటు పరిసరాల ప్రాంతాల్లో కొండలు, కొండవాలు ప్రాంతాలు, ప్రభుత్వ ఖాళీ స్థలాలను ఆక్రమించుకుని వేలాది మంది ఇళ్లు నిర్మించుకున్నారు.గత టీడీపీ హయాంలో ఇచ్చిన జీవో 296 మేరకు నగరంలో 83,891 మంది క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేయగా 46,526 మందిని అర్హులుగా గుర్తించి పట్టాలిచ్చారు. మరో 544 మందికి పట్టాలు జారీచేసే ప్రక్రియ పెండింగ్‌లో ఉండిపోయింది. 36,821 దరఖాస్తులను తిరస్కరించారు. ఇంకా 388 జీవో మేరకు 53,347 మంది దరఖాస్తు చేయగా 8,687 మంది అర్హులని తేల్చారు. వీరిలో 7,030 మంది క్రమబద్ధీకరణకు డబ్బు చెల్లించడంతో పట్టాలిచ్చారు. అయితే 296, 388 జీవో మేరకు క్రమబద్ధీకరణ చేసిన రెండేళ్లలో కన్వేయన్స్ డీడ్ ఇవ్వాలి.కానీ 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత దీనిని పూర్తిగా పక్కన పెట్టేసింది.తాజాగా వారందరికీ కన్వేయన్స్ డీడ్స్ ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పాటు గతంలో క్రమబద్ధీకరణ జీవో మేరకు దరఖాస్తు చేయని వారంతా మరోసారి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది.

ఘనంగా డీఈఐ వ్యవస్థాపక దినోత్సవం

విశాలాక్షినగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : దయాల్‌నగర్‌లో ఉన్న దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ (డీఈఐ) వ్యవస్థాపక దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా దయాల్బాగ్ రాధాస్వామి 7వ మత గురువు డాక్టర్ ఎం. బీలాల్ సాహెబ్ జయంతి జరిపారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన వస్తువుల ప్రదర్శన, అమ్మకాలను ప్రారంభించారు.

రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిట

... 3వ పేజీ తరువాయి

రోజుకు 20కి మించి డాక్యుమెంట్లు రిజిస్టర్ కావు. అక్కడ అన్నీ వ్యవసాయ భూములే కావడంతో పెద్దగా లావాదేవీలు జరగవు. అయితే ధరలు పెరుగుతున్న నేపథ్యంలో భారీగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. గురువారం 58, శుక్రవారం 98 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేసినట్టు సబ్ రిజిస్ట్రార్ ఆనంద్‌కుమార్ తెలిపారు.గాజువాకలో గురు వారం 53, శుక్రవారం 98 డాక్యుమెంట్లు రిజిస్టర్ అయినట్టు సబ్ రిజిస్ట్రార్ తారకేశ్ వివరించారు. ఇలా అన్ని కార్యాలయాల్లో రెట్టింపు కంటే ఎక్కువ జరిగాయి. జిల్లా వ్యాప్తంగా చూసుకుంటే గురువారం 663, శుక్రవారం 871 డాక్యుమెంట్లు రిజిస్టర్ అయినట్టు జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర తెలిపారు. అయితే ఎక్కువ డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయడం వల్ల సర్వర్ ఇబ్బంది పెట్టింది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి ప్రక్రియ ఆగిపోయింది. అధికారులు, సిబ్బంది రాత్రి పది గంటల వరకు ఉండి వచ్చిన డాక్యుమెంట్లన్నింటినీ రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు.

సిబ్బంది తగ్గాలట, ఉత్పత్తి పెరగాలట!

... 3వ పేజీ తరువాయి

కార్మికులను నిలిపివేశారు. ఇంకో వేయి మందిని ఆపేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ కార్మికులు అన్ని విభాగాల్లో కీలకమైన పనులు చేస్తారు. సింటర్ ప్లాంటు, బ్లాస్ట్‌ఫర్నేస్‌లు, కోక్ ఓవెన్ల వంటి విభాగాల్లో 30 శాతం తగ్గించేస్తే అక్కడ పనులు చేసే వారు ఉండరు. ఆయా పనులను ఎగ్జిక్యూటివ్‌లు కానీ, నాన్ ఎగ్జిక్యూటివ్‌లు కానీ చేయరు. చేయలేరు. దానివల్ల అక్కడ ఉత్పత్తి ప్రక్రియ మందగిస్తుంది. ఆశించిన లక్ష్యాలు సాధించడం కుదరదు. అన్నిచోట్ల ఒకేలా వ్యవహరించడం తగదని ఆయా విభాగాల అధికారులు చెబుతున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదు. ఇటీవల సింటర్ ప్లాంటులో క్లీనింగ్ సిబ్బందిని తీసేశారని, దానివల్ల కన్వేయర్ల వద్ద ఇబ్బందులు వస్తున్నాయని, కాంట్రాక్ట్ సిబ్బందిని నియమించాలని ఏడు నెలల క్రితమే ఆ విభాగం యాజమాన్యానికి లేఖలు రాసినా పట్టించుకోలేదు. దానికి భారీ మూల్యం చెల్లించుకోవలసి వచ్చింది. ఇకపై జరిగే ప్రమాదాలకు కూడా ఇవే ప్రధాన కారణాలుగా నిలుస్తాయని అధికార వర్గాలు చెబుతున్నాయి.

ఫ్రీ హోల్డ్‌లో అవకతవకలు

... 3వ పేజీ తరువాయి

పశువులు/గొర్రెలు/మేకల మేత కోసం ఎంపిక చేసిన బీడు భూములకు డీపట్టాలు ఇవ్వకూడదు. అయితే మూడు దశాబ్దాల క్రితం అప్పటి అధికారులు రామవరంలో గల ఆ 7.5 ఎకరాలకు డీపట్టాలు ఇచ్చారు. ఆ భూముల్లో రైతులు తోటలు పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం 2023 డిసెంబరులో జారీచేసిన జీవో మేరకు మేకల మేత బీడుగా ఉన్న ఆ 7.5 ఎకరాల డీపట్టా భూములకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు అయ్యాయి. దీనిపై అప్పట్లో రైతులు అభ్యంతరం వ్యక్తంచేశారు. అయితే వైసీపీ నేతల దన్ను ఉండడంతో రైతుల అభ్యంతరాలను మండల రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. రామవరం, కోలవానిపాలెం, భీమన్నదొరపాలెం గ్రామాల్లో పలు సర్వే నంబర్లలో గల డీపట్టా భూములు చాలాకాలం క్రితమే చేతులు మారాయి. రెండున్నర దశాబ్దాల క్రితం అప్పటి అధికారులు విచారణ జరిపి చేతులు మారిన భూములకు సంబంధించి డీపట్టాలు రద్దు చేశారు. అప్పట్లో రద్దు చేసిన డీపట్టా భూముల్లో కొన్నింటికి గత ఏడాది ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు ఇచ్చారనే వాదన వినిపిస్తోంది. రెండున్నర దశాబ్దాల క్రితం డీపట్టాల రద్దుకు సంబంధించి రికార్డులు ప్రస్తుతం లభ్యం కావడం లేదని తెలిసింది. అప్పట్లో భూములు కొనుగోలు చేసిన బడాబాబులు డీపట్టా భూములను తమ ఆధీనంలోనే ఉంచుకుని తోటలు పెంచారు. ఇదిలావుండగా జిల్లాలో ఎనిమిది ఎకరాలకు సంబంధించి ఫ్రీహోల్డ్ అనుమతుల మంజూరులో నిబంధనలు పాటించలేదని జిల్లా అధికారులు గుర్తించారు. రామవరంలో 7.5 ఎకరాల మేకల బీడు, పాలవలసలో 45 సెంట్ల రాస్తాకు ఫ్రీ హోల్డ్ అనుమతులు ఇచ్చారని ప్రభుత్వానికి నివేదించారు.

పలాస, పార్వతీపురం పాసింజర్ రైళ్ల గమ్యాల కుదింపు

విశాఖపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక కారణాల వలన విశాఖ-పార్వతీపురం మధ్య నడిచే 67287, 67288 నంబర్లు గల పాసింజర్ రైళ్లు ఈనెల ఒకటి నుంచి మార్చి ఒకటి వరకు విశాఖ-విజయనగరం మధ్య రాకపోకలు సాగిస్తాయని, విజయనగరం-పార్వతీపురం మధ్య రాకపోకలను తాత్కాలికంగా రద్దు చేశామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

అలాగే విశాఖ-పలాస మధ్యనడిచే 67289, 67290 నంబర్లు గల పాసింజర్ రైళ్లు ఈనెల ఒకటి నుంచి 28వ తేదీ వరకు విశాఖ-శ్రీకాకుళం రోడ్డు మధ్య రాకపోకలు నడుస్తాయని, శ్రీకాకుళం రోడ్డు-పలాస మధ్య రాకపోకలను తాత్కాలికంగా రద్దు చేశామని పేర్కొన్నారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.

ఏయూను సందర్శించిన ఐఐఎస్సీ ఆచార్యులు



వెంకోజీపాలెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (బెంగళూర్) ఆచార్యులు డాక్టర్ ఎస్పీ శివప్రకాష్ ఏయూను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ జి.శశిభూషణరావును మర్యాదపూర్వకంగా కలిసి ఏయూ ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ శివప్రకాష్‌ను ఏయూ తరపున వీసీ సత్కరించారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ ఆచార్య కె.ఈశ్వర్‌కుమార్, అడ్మిషన్స్ డైరెక్టర్ ఆచార్య డి.ఎ.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై ఆర్డీవో ఫిర్యాదు

పెందుర్తి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం విధి నిర్వహణలో ఉన్న తన పనులకు ఆటంకం కలిగించడంతో పాటు దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై విశాఖ ఆర్డీవో శ్రీలేఖ శుక్రవారం పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశారు. సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

పెందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో జనవరి 27న నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఆర్డీవో హాజరై ప్రజల నుంచి అర్జీల స్వీకరణ చేపట్టారు. ఈ క్రమంలో మురళీనగర్‌కు చెందిన డీవీ మహేశ్ అనే వ్యక్తి వేపగుంటలోని ఓ స్థల సమస్యకుసంబంధించిన పత్రాలతో వచ్చాడు. ఆయనకు కాసేపు వేచివుండాలని సిబ్బంది తెలిపారు. దీంతో సదరు వ్యక్తి తన ఎదుట అసహనం వ్యక్తం చేయడంతో పాటు విధులకు ఆటంకం కలిగించి. దురుసుగా ప్రవర్తించాడని.. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ ఆర్డీవో పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మహేశ్‌పై కేసు నమోదు చేసినట్టు సీఐ పేర్కొన్నారు.

సినిమా గైడ్

● **మదగజరాజ :** జగదాంబ, సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
● **మహిష :** రమాదేవి
● **సంక్రాంతికి వస్తున్నాం :** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)
● **డాకు మహారాజ్ :** శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం),కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 30, టమాటా 12, వంకాయలు (తెలుపు)20, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 46, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 46, బీరకాయలు 50, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 12, క్యాబేజ్ 14, క్యారెట్ 28 దొండకాయలు 36, బంగాళ దుంపలు 22, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 110, అల్లం (పాతది)44, బరబాటి 34, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 62, బద్దచిక్కుడు 24, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 44, పొటల్స్ 80, కీర దోస 32, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 436 చిలగడ దుంపలు 36, కంద 56, దేముడు చిక్కుడు 24, గోరు చిక్కుడు 26, ఆగాకార దేశవాళి 100 , ఆగాకర హైబ్రిడ్ 50, కూర పెండలం 26, బ్రకోలి 70 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 60, కరివేపాకు(కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 18, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	95
లైవ్ ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210

చంద్రబాబు, పవన్ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం

» సర్వేనెం.275లో గల భూముల క్రమబద్ధీకరణపై హర్షం
» 15వ వార్డులో హర్షాతిరేకాలు

వెంకోజీపాలెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానం భూములకు సంబంధించి సర్వే నెం.275లో గల భూముల క్రమబద్ధీకరణ, పంచగ్రామాల సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్న కూటమి ప్రభుత్వానికి 15వ వార్డు కొండవాలు ప్రాంత వాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. శుక్రవారం హెచ్‌బీకాలనీ జంక్షన్‌లో టీడీపీ 15వ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ ఆధ్వర్యంలో కూటమి నాయకులు, లబ్ధిదారులు సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం నిర్వహించారు. దేవస్థానంతో సంబంధం, ఇబ్బంది లేకుండా ఎవరికి వారే ఇండ్లను నిర్మించుకునే విధంగా అవకాశాన్ని కల్పిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఎన్నికల హామీ ప్రకారం తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి.రామకృష్ణబాబు, భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఈ సమస్య పరిష్కారానికి కృషి చేయడం ప్రజలు, స్థానిక సమస్యలపై వారికున్న నిబద్ధత అని కొనియాడారు. ఒకరికొకరు మిఠాయిలను తినిపించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ 15వ వార్డు ప్రధాన కార్యదర్శి, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, సూరిబాబు, గౌరి, వరలక్ష్మి, కె.మహేష్, జనసేన యడ్ల కళావతి, పి.సాయిబాబా, కె.నరసింగరావు పాల్గొన్నారు.



చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం నిర్వహిస్తున్న కొండవాలు ప్రాంత వాసులు

ప్రసాదరెడ్డి అవినీతిపై విచారణ చేపట్టాలి

ఏయూ వీసీకి ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ పూర్వ విద్యార్థులు సంఘం వినతి


వీసీ శశిభూషణరావుకు వినతిపత్రం అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

వెంకోజీపాలెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఏయూలో గత ఉపకులపతి పీవీజీడీ ప్రసాదరావు హయాంలో జరిగిన అవకతవకలు, ఏయూ టీడీఆర్ హబ్‌కు సంబంధించిన పీహెచ్‌డీల విషయంలో బాధ్యులపై చర్యలు చేపట్టాలని కోరుతూ ఏయూ వీసీ జి.శశిభూషణరావుకు శుక్రవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పూర్వ విద్యార్థులు సంక్షేమ సంఘం సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఏయూ టీడీఆర్ హబ్‌కు డీన్‌గా వ్యవహరించిన డాక్టర్ జేమ్స్ స్టీఫెన్ అక్రమంగా, నిబంధనలను వ్యతిరేకంగా అంతా తానై యూనివర్సిటీ నిబంధనలు అతిక్రమించి ప్రీ పీహెచ్‌డీ పరీక్షల పేపర్ తయారీ, పేపర్ వాల్యూయేషన్ చూసి అక్రమాలకు పాల్పడ్డారని, అతనిపై చర్యలు తీసుకోవాలని వీసీని కోరారు. ఏయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఛైర్ ప్రొఫెసర్‌గా మూడు సంవత్సరాల కాలపరిమితికి చేరిన డాక్టర్ ఎం.జేమ్స్‌స్టీఫెన్‌ను తక్షణమే తొలగించి ఇన్‌చార్జిగా రెగ్యులర్ ప్రొఫెసర్‌కు బాధ్యతలు అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోటి జాన్, కార్యదరి ఆరేటి మహేష్, టి.సురేష్‌కుమార్, సురేంద్ర, బి.కృష్ణ, యూవీ రమణ తదితరులు ఉన్నారు.

జాతీయ బీచ్ వాలీబాల్ టోర్నీకి ఆంధ్ర జట్టు


జాతీయ బీచ్ వాలీబాల్ టోర్నీలో పాల్గొననున్న పురుషులు, మహిళల జట్లు

విశాఖపట్నం, స్పోర్ట్సు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : జాతీయ క్రీడల బీచ్ వాలీబాల్ పోటీల్లో పాల్గొనే ఆంధ్ర పురుషుల, మహిళల జట్ల సభ్యులను శుక్రవారం ప్రకటించారు. పురుషుల విభాగంలో కృష్ణంరాజు, నరేష్, మణికంఠ రాజు..మహిళల విభాగంలో మానస, మౌనిక, దివ్యసాయి ప్రాతినిధ్యం వహించనున్నారు. పురుషుల జట్టుకు రక్షణకుమార్, మహిళల జట్టుకు రంజని కోచ్‌లుగా, ఇరు జట్లకు మేనేజర్‌గా భగవాన్‌దాస్ వ్యవహరించనున్నారు. ఉత్తరాఖండ్, డెహ్రాడూన్‌లో జరిగే ఈ టోర్నీలో పాల్గొనే క్రీడాకారులకు గత వారం రోజులుగా రామకృష్ణ బీచ్ వద్ద జరిగిన శిక్షణా శిబిరం శుక్రవారం ముగిసింది. శిక్షణాశిబిరం ముగింపు కార్యక్రమానికి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కేవీ బాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులు క్రీడా దుస్తులు అందజేసి ప్రతిష్ఠాత్మక టోర్నీలో ఆంధ్రాకు పతకం అందించాలని ఆకాంక్షించారు. కాగా టోర్నీలో పాల్గొనేందుకు అయ్యే రవాణా చార్జీలు,ఇతర ఖర్చులకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ వాలీబాల్ సంఘం రూ.90 వేలను జట్ల సభ్యులకు అందించిందని జిల్లా వాలీబాల్ సంఘం కార్యదర్శి రక్షణకుమార్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వాలీబాల్ సంఘం కార్యదర్శి టీవీ భగవాన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం


పదవీ విరమణ పొందనున్న ఉద్యోగులను సన్మానిస్తున్న జీవీఎంసీ ఏడీఏ రమణమూర్తి

వెంకోజీపాలెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీలో వివిధ హోదాలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న 11 మంది అధికారులు, ఉద్యోగులను శుక్రవారం జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి చేతుల మీదుగా సత్కరించారు.

ఈ సందర్భంగా ఏడీసీ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన వారంతా శేష జీవితాన్ని చక్కగా గడపాలన్నారు. సత్కారం అందుకున్న వారిలో పర్యవేక్షక ఇంజనీరు కె.రామ్మోహనరావు, ప్రాజెక్టు అధికారి బి.రమణమ్మ, సీనియర్ అసిస్టెంట్ వై.మల్లేశ్వరరావు, పీహెచ్ వర్కర్లు కె.సోమయ్య, పోలమ్మ, ఎన్.ఆదినారాయణరావు, పి.పెద్ద అప్పిలి, ఎమ్.టి.ఎస్.ఉద్యోగులు బి.పాపారావు, పి.అప్పారావు, బాల్యం టీచరు ఎం.అన్నమ్మని, ఆయా ఎస్.సత్యవతి ఉన్నారు. ఉద్యోగులకు ప్రావిడెండ్ ఫండ్ సొమ్మును రూ.66 లక్షల 5 వేల 732 లను ఏడీసీ అందజేశారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

శ్రీసత్యసాయి ప్రేమసదన్ మందిర్ ప్రారంభం


మహిళలకు కుట్టు మిషన్లు అందిస్తున్న రత్నాకర్ తదితరులు

ఎంవీపీ కాలనీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : భగవాన్ శ్రీసత్యసాయిబాబా శతాబ్ది ఉత్సవాలలో భాగంగా శ్రీసత్యసాయి ప్రేమసదన్ మందిర్‌ను శుక్రవారం శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ జె.రత్నాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జీవనోపాధి కార్యక్రమాల ద్వారా మహిళలకు ఆర్థిక భరోసా అందించేందుకు దోహదపడే పలు వృత్తి ఆధారిత పనిముట్లు పంపిణీ చేశారు. కొత్తగా పునరుద్ధరించిన సత్యసాయి ప్రేమసదన్ మందిర్ ప్రారంభోత్సవంలో హిమవాహినీ రత్నాకర్ పాల్గొన్నారు. అనంతరం ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల వివిధ విభాగాల అధిపతులు, ప్రతినిధులు కోటీశ్వరరావు, చలం, ఆర్.లక్ష్మణరావు, పిఆర్ఎస్ఎన్ నాయుడు, డీవీవీ సీతారామరాజు పాల్గొన్నారు.

టీడీఆర్ హబ్ రద్దుపై హర్షం

వెంకోజీపాలెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : టీడీఆర్ హబ్ రద్దుపై ఏయూ పరిరక్షణ సమితి హర్షం వ్యక్తం చేసింది. యూజీసీ నియమాలకు విరుద్ధంగా జరిగిన పీహెచ్‌డీలను నిలిపివేసినందుకు అభినందనలు తెలిపింది. సుమారు 679 మంది పరిశోధకులకు న్యాయం జరిగే విధంగా యూనివర్సిటీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఏయూ పీజీ ప్రవేశాలకు పూర్వ పద్ధతిలోనే ఆసెట్ నిర్వహించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. స్టేట్ లెవెల్ ఎంట్రన్స్ టెస్ట్ వలన లోకల్ అభ్యర్థులు తీవ్రంగా నష్టం జరుగుతోందని, అందువల్ల ఏయూ కామన్ అడ్మిషన్ పరీక్ష నిర్వహించాలని కోరారు. ఏయూకు సీనియర్ ప్రొఫెసర్‌నే వీసీగా నియమించాలని, చిన్న యూనివర్సిటీలు పరిపాలన అనుభవం తక్కువగా ఉంటుందని, ఉన్నత విద్యపై ప్రయోగాలు వద్దని సమితి ప్రతినిధులు హితవు పలికారు. గత ప్రభుత్వంలో ఉన్నత విద్య అనేక రకాలుగా నష్టపోయిందని, ఆ నష్టాన్ని భర్తీ చేసే ఆలోచన చేయాలని, రాజకీయ నాయకులు యూనివర్సిటీని పరిపాలనలో తలదూర్చకపోతే యూనివర్సిటీ సీనియర్ ఆచార్యులు ఏయూని ప్రపంచ స్థాయికి తీసుకుని వెళతారన్నారని సమితి అధ్యక్షులు సురేష్ మీనన్, కార్యదర్శి శ్రీనివాసరావులు ప్రకటన ద్వారా తెలియజేశారు.

ఉక్కు దీక్షా శిబిరం కొనసాగింపుపై తర్జనభర్జన?

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం కూర్మన్నపాలెం ఆర్చి వద్ద ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని కొనసాగించాలా, వద్దా.. అనే అంశంపై నాయకులు తర్జనభర్జన పడుతున్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాదని, ఉక్కు కర్మాగారానికి కేంద్రం పూర్తిగా సహకరిస్తుందని, ప్లాంట్ అతి తక్కువ కాలంలోనే అన్ని రంగాల్లో ప్రగతి సాధించేందుకు సహకారాన్ని అందిస్తామని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, ఉక్కుశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మలు గురువారం స్పష్టం చేశారు. అదేవిధంగా ఇప్పటికే ప్లాంటుకు కేంద్రం భారీ ప్యాకేజీని ప్రకటించింది. ఈ నేపథ్యంలో దీక్షా శిబిరాన్ని ఎత్తివేయాలన్న డిమాండ్ ఉన్నప్పటికీ కొంత మంది మాత్రం కొనసాగించాలని పట్టుబడుతున్నట్టు తెలిసింది. అయితే దీక్షా శిబిరం కొనసాగింపు వల్ల ఎటువంటి ప్రయోజనం లేదని, ఉక్కు కర్మాగారానికి కేంద్రం సహకరిస్తున్నప్పుడు దీక్షల కొనసాగింపు ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు.

నేటి నుంచి వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ పోటీలు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మెడ్‌టెక్ జోన్‌లో ఫిబ్రవరి 1, 2 తేదీల్లో వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించనున్నారు. ఆర్థోటిక్స్, ప్రోస్తెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఓపీఏఐ) ఆధ్వర్యంలో వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూబీఎఫ్ఐ) సహకారంతో ఈ పోటీలు జరగనున్నాయి. అదేవిధంగా ఓపీఏఐ 28వ సమావేశాన్ని నిర్వహించనున్నారు.

ప్రతి నెలా జీతాలు చెల్లించాలి

ఏయూ వీసీ, రిజిస్ట్రార్‌లకు గెస్ట్ లెక్చరర్ల వినతి


రిజిస్ట్రార్ ధనుంజయరావుకు వినతి పత్రం ఇస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీ సభ్యులు

వెంకోజీపాలెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఏయూలో అతిథి అధ్యాపకులుగా పనిచేస్తున్న అర్హత కలిగి, అనేక పరిశోధన పత్రాలు, సిక్స్‌మెన్ కమిటీతో నియమించిన అందరికీ నెలవారీవేతనాలు ఇవ్వాలని ఏయూ వీసీ జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఈఎస్ ధనుంజయ్‌రావును శుక్రవారం గెస్ట్ ఫ్యాకల్టీ సభ్యులు కలిసి వినతిపత్రం అందజేశారు. అతిథి అధ్యాపకులకు టీడీఎస్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఆదికవి నన్నయ్య డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, నన్నయ్య యూనివర్సిటీల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులు కూడా టీడీఎస్ నుంచి మినహాయింపు ఇచ్చారని చెప్పారు. ఏయూ పీజీ ప్రవేశాలను ఆసెట్ ద్వారా నిర్వహించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర కామన్ ప్రవేశ పరీక్ష వలన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అందువల్ల ఆసెట్ నిర్వహించాలని కోరారు. అదే రకంగా దివ్యాంగులకు డిజేబులిటీ సెల్‌కు డీన్‌ని నియమించాలని, తిరిగి సెల్ పనిచేసే విధంగా చూడాలని వీసీని, రిజిస్ట్రార్‌ను కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.సురేష్‌మీనన్, డాక్టర్ దాస్, డాక్టర్ శిరీష్, విక్రం మైకేల్, సురేంద్ర, దేవానంద్, డాక్టర్ శ్రీనివాస్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

జూలో విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు


పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఆరిలోవ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ జీబ్రాల దినోత్సవం సందర్భంగా ఇందిరా గాంధీ జంతు ప్రదర్శన శాలలో శుక్రవారం విద్యార్థులకు పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలో ఎల్‌కేజీ నుంచి పోస్టు గ్రాడ్యుయేషన్ వరకు చదువుతున్న విద్యార్థులు పాలొని తమ సృజనాత్మకతను ప్రదర్శించారు.

ప్రస్తుతం ఇక్కడి జూలో ఉన్న జీబ్రాలను 2019లో కోల్‌కతాలోని ఆలిపూర్ జూ నుంచి జంతుమార్పిడి విధానంలో తెచ్చినట్టు జూ క్యూరేటర్ మంగమ్మ తెలిపారు. జీబ్రాలు సాధారణంగా గోధుమ ఊక, పిండి చేసిన భారతీయ బియ్యం, శెనగలు, పిండిచేసిన బార్లి క్యాలెట్, ఎండుగడ్డి ఓట్స్ వంటి ఆహారం తీసుకుంటాయని తెలిపారు. దీని జీవిత కాలం సుమారు 20 నుండి 25 ఏళ్లు అని చెప్పారు.


స్టీల్‌ప్లాంటును పరిరక్షించాలంటూ నినాదాలు చేస్తున్న లక్ష్మి తదితరులు

స్టీల్‌ప్లాంటుకు సొంత గనులు కేటాయించాలి

» పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మి

సిరిపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ కాదంటూ కేంద్ర ప్రభుత్వం కల్లబొల్లి కబుర్లు ఆపి వెంటనే స్పష్టమైన ప్రకటన చేయాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి డిమాండ్ చేయాలి. శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కొనసాగుతున్న దీక్షల్లో పీవోడబ్ల్యూ విశాఖ జిల్లా కమిటీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటు విషయంలో కూటమి ప్రభుత్వం డ్రామాలు ఆడుతోందని విమర్శించారు. స్టీల్‌ప్లాంటుకు సొంత గనులు కేటాయించాలన్నారు. నిర్వాసితులందరికీ శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని, స్వచ్ఛంద పదవీ విరమణ పథకాన్ని రద్దు చేయాలన్నారు. స్టీల్‌ప్లాంటుకు తక్షణమే రూ.15 వేల కోట్లు నిధులు వర్కింగ్ క్యాపిటల్ కింద కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ విశాఖ జిల్లా అధ్యక్షురాలు ఎస్.వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శి డీకేఎస్ రోహిణి, ఉపాధ్యక్షులు కే.బాలనాగమ్మ, కోశాధికారి వరలక్ష్మి, లక్ష్మి, జయమ్మ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం


స్కూలులో ప్రచారం నిర్వహిస్తున్న విజయగౌరి, కుమార్‌మంగళం

మద్దిలపాలెం, జనవరి31(ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీడీఎఫ్ బలపరిచిన విజయగౌరికి తొలి ప్రాధాన్యం ఓటు వేయాలని పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కన్వనర్ కుమార్‌మంగళం కోరారు. మద్దిలపాలెం ఏరియాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో శుక్రవారం పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరితో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యావ్యవస్థలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువస్తున్న నూతన విద్యావిధానం వలన విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు తీవ్ర హాని ఎదురవుతోందన్నారు. ఇప్పటికే అనేక యాప్‌లు ప్రవేశపెట్టి పనిభారాన్ని పెంచారన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేసే అధ్యాపకులకు ప్రభుత్వమే వేజ్‌బోర్డు ఏర్పాటు చేయాలని, హెల్త్ ఇన్సూరెన్స్, 200 గజాల ఇంటి స్థలం కేటాయించాలని డిమాండ్‌తో ముందుకు వెళ్తున్నామన్నారు. ఈ ప్రచారంలో పీడీఎఫ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

భారతదేశం భిన్న సంస్కృతుల సమ్మేళనం

» భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు


నృత్యం చేస్తున్న చిన్నారులు

మద్దిలపాలెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : భిన్న సంస్కృతుల సమ్మేళనమే భారతదేశమని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. పీఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన వండర్‌కిడ్స్-25 కళోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో ఒక్కో రాష్ట్రంలో ఒక్కో సంస్కృతి, సంప్రదాయాలు ఉన్నాయన్నారు. దేశంలోని భాషలు, సంస్కృతులు, సంగీత కళలు విద్యార్థులపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వండర్ కిడ్స్ కళోత్సవంలో దేశంలోని ఇతర రాష్ట్రాల సాంప్రదాయ నృత్యాలు ప్రదర్శించిన తీరు అద్భుతమని వర్ణించారు. విద్యార్థులకు అన్ని వర్గాల ఆచారాలు, కళలపై అవగాహన పెంచుతున్న స్కూల్ ఆఫ్ వండర్‌కిడ్స్ డైరెక్టర్ మళ్ల రామునాయుడు, వాణిలను అభినందించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఈవో విజయ్ భాస్కర్, ఏపీపీయూఎస్ఎంఈ రాష్ట్ర అధ్యక్షుడు తులసీవిష్ణుప్రసాద్, కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణం కోసం ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్ర అందజేస్తున్న దృశ్యం

అక్కయ్యపాలెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 43వ వార్డు అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలో వేణుగోపాలస్వామి ఆలయ పునర్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకు టీడీపీ వార్డు అధ్యక్షుడు బొడ్డేటి మోహన్ కోరారు.శనివారం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. గత 37 ఏళ్ళ క్రితం నిర్మించిన ఈ ఆలయం శిథిలావస్థకు చేరిందని, దీని పునర్నిర్మాణానికి రూ.67.50 లక్షలు ఖర్చు అవుతుందని దేవదాయశాఖ ఉప కార్యనిర్వాహణ ఇంజనీర్ అంచనా వేశారన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో టీడీపీ యూత్ సెక్రటరీ రాజగిరి కన్నబాబు, నాగరాజు ఉన్నారు.

సెమీస్‌కు చేరిన ఆలిండియా సీనియర్ టెన్నిస్ టోర్నీ

విశాఖపట్నం, స్పోర్ట్సు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆఫీసర్స్ క్లబ్‌లో జరుగుతున్న సీఎంఆర్ అయిస్టా టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీ సెమీఫైనల్స్ దశకు చేరింది. శుక్రవారం జరిగిన 35, 45, 55, 65 ప్లస్ విభాగాల సింగిల్స్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు సెమీస్‌కు చేరారు. శుక్రవారం జరిగిన 70 ప్లస్ డబుల్స్‌లో డీఎస్ఎన్ రాజు-సన్యాసిరాజు 2-1 సెట్లతో డాక్టర్ చంద్రశేఖర్-ఎం.సాయి రాంబాబులపై విజయం సాధించి ఫైనల్స్‌కు చేరారు.

సింగిల్స్ 35 ప్లస్ విభాగంలో ఇ.ఈశ్వర్, విజయానంద్, కన్నన్ సేతు; 45 ప్లస్ విభాగంలో పిఎన్.రాజు, జి.రమేష్, రామారావు, ఎంవిఎల్ఎన్.రాజు; 55 ప్లస్‌లో మణికందన్, ఆర్ఎస్.రావత్, ఆర్ఎన్.రమేష్, బిఆర్.సుధాకరరెడ్డి సెమీఫైనల్స్‌కు చేరారు. డబుల్స్‌లో 45 ప్లస్ విభాగంలో ఎంవిఎల్ఎన్.రాజు-కె.బాబ్జి సెమీస్‌లోకి ప్రవేశించారు.

'లేబర్ కోడ్స్ రద్దు చేయాలి'

పూర్ణామార్కెట్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5న సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించనున్నట్టు సంఘం ప్రధాన కార్యదర్శి కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తోందని విమర్శించారు. లేబర్ కోడ్స్ రద్దు అందులో భాగమేనన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాల్లో 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్పు చేసిందని, ఇవి అమల్లోకి వస్తే కార్మికులకు నష్టం తప్పదని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే కార్మిక సంఘాలు సమ్మె నోటీసులు ఇచ్చే అవకాశం కోల్పోతాయని తెలిపారు . ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా 5న నిరసన ర్యాలీలు చేయనున్నట్టు చెప్పారు.

మాఘ మాసోత్సవాలు ప్రారంభం

అల్లిపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వెంకటేశ్వర మెట్టపై వెలసిన అలవేలు మంగమ్మ సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో ఉన్న ఉషా ఛాయాదేవి సమేత సూర్యనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి మాఘ మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అర్చకుడు పాణంగిపల్లి కేశవాచార్యులు మాట్లాడుతూ నాలుగు మాఘ ఆదివారాల్లో ప్రత్యేక అభిషేకాలు జరుపుతామని తెలిపారు. 4న రథసప్తమి, 8న భీష్మ ఏకాదశి రోజున శ్రీనివాస కల్యాణం, 12న మాఘ పౌర్ణమి రోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని చెప్పారు. .

కృతిమ మేధస్సు పాత్ర కీలకం

సీతంపేట, జనవరి 31, (ఆంధ్రజ్యోతి) : మానవ వనరుల వినియోగంలోనూ, అభివృద్ధిలోనూ కృతిమ మేధస్సు పాత్ర కీలకమని అజినో మోటో బయో ఫార్మా ఉపాధ్యక్షుడు పి. శ్రీనివాస ఠాగూర్ అన్నారు. ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో నేషనల్ హెచ్ఆర్‌డీ నెట్ వర్క్ విశాఖ చాప్టర్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం శుక్రవారం వైభవంగా జరిగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు.

మహిళా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రమణికుమారి, ఉషారాణి, మాధురి, అల్మా, ఝాన్సీరాణి, కుష్బూ తదితరులు

సీతంపేట, జనవరి 31, (ఆంధ్రజ్యోతి) : మహిళలు అన్ని రంగాల్లో ప్రావీణ్యం సంపాదించాలని, అప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని పలు మహిళా సంఘాలు, రాజకీయ పార్టీల మహిళా నేతలు పేర్కొన్నారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో క్వీన్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో మార్చి 7న నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైసీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, క్వీన్ ఈవెంట్స్ ఆర్గనైజర్ ఎం.ఉషారాణి, మను చారిటబుల్ ట్రస్ట్ మనుపల్ల భీమరశెట్టి మాధురి, అల్మా, ఝాన్సీరాణి, కుష్బూ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పేడాడ రమణికుమారి, ఉషారాణి మాట్లాడుతూ మార్చి 7వ తేదిన పది గంటల నుంచి సాయంత్రం వరకు ఆహ్లాదకర వాతావరణంలో మహిళా దినోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతిభావంతులైన పలువురు మహిళలను స్ఫూర్తిదాయక మహిళా అవార్డులతో సత్కరించనున్నట్టు తెలిపారు. డ్యాన్సింగ్ క్వీన్, రెట్రో క్వీన్ పోటీలు, రంబోలా తదితర ఆటల పోటీలను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పోటీలో పాల్గొనదలచిన వారు పూర్తి వివరాల కోసం ఫోన్ : 7842227101లో సంప్రదించాలన్నారు. సమావేశంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

విగ్రహాలకు ముసుగులు, నేతల ఫ్లెక్సీల తొలగింపు



ఫ్లెక్సీలు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సీతమ్మధార, జనవరి 31, (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో జీవీఎంసీ జోన్-3 పరిధిలోని సీతమ్మధార, సీతంపేట, మద్దిలపాలెం, నక్కవానిపాలెం, ఇందిరాప్రియదర్శిని కాలనీ, కేఆర్ఎం కాలనీ తదితర ప్రాంతాల్లో గల రాజకీయ నేతల విగ్రహాలకు క్లాత్‌లు కప్పడంతో పాటు రాజకీయ నాయకులకు సంబంధించిన పోస్టర్లను సచివాలయం టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలగించారు. విగ్రహాల వద్ద గల శిలాఫలకాలపై పేర్లు కనబడకుండా ఉండేలా కాగితాపు చార్టులను అతికించారు.

అయిస్టా చిల్డ్రన్స్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీ ప్రారంభం



చిన్నారులను అభినందిస్తున్న మాజీ డీజీపీ సాంబశివరావు

విశాఖపట్నం, స్పోర్ట్సు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : అయిస్టా నిర్వహిస్తున్న సబ్ జూనియర్ బాలుర, బాలికల టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీ శుక్రవారం ప్రారంభమైంది. ఏయూ టెన్నిస్ సెంటర్‌లో జరుగుతున్న ఈ పోటీలను మాజీ డీజీపీ ఎన్.సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో టోర్నీ డైరెక్టర్ నడింపల్లి కృష్ణంరాజు, ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్సు సైన్సెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.విజయ్‌మోహన్, అయిస్టా ప్రతినిధులు డీఎస్ఎన్.రాజు, ప్రేమ్‌చంద్, కోచ్ కె.బాబ్జి పాల్గొన్నారు.

డీఎస్సీ ప్రకటనపై హర్షం

అక్కయ్యపాలెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ముగియగానే టీచర్ పోస్టుల కోసం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్టు సీఎం చంద్రబాబు ప్రకటించడంపై ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికలు పూర్తయ్యేలోగా జీవో నెంబరు 117పై స్పందించి రద్దుచేయాలని కోరారు.

ఎమ్మెల్యే వంశీకృష్ణ జన్మదినం సందర్భంగా వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పాల్గొన కూటమి నాయకులు

సీతంపేట, జనవరి 31, (ఆంధ్రజ్యోతి) : దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ జన్మదినం సందర్భంగా గ్రేటర్ విశాఖ 25వ వార్డు సీతంపేట రాధాకృష్ణా మందిరం వద్ద వార్డు జనసేన పార్టీ అధ్యక్షుడు కూరెళ్ల సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఉత్తర నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి వెల్లంకి భరత్, జనసేన పార్టీ ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, మాజీ కార్పొరేటర్ నారా నాగేశ్వరరావుల చేతుల మీదుగా కేక్ కట్ చేశారు. పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి వివిధ వైద్య పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో భీమవరపు శ్రీను, నమ్మి రవికుమార్, నరాల బాలకృష్ణ, ఉమాశంకర్, ఇసరపు వాసు, ఇసరపు కుమార్, కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళా అభిమానులు పాల్గొన్నారు.

పేదలకు పథకాల అమలు తీరుపై విద్యార్థుల పరిశీలన



విద్యార్థులతో ఏయూటీడీ సిబ్బంది

అక్కయ్యపాలెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : నగరంలో పేదలకు జీవీఎంసీ అందిస్తున్న పథకాల అమలు తీరు తెలుసుకొనేందుకు 23 మంది రోడా మిస్త్రీ సోషల్ వర్క్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీరాములు ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని జీవీఎంసీ నిరాశ్రయుల వసతి గృహాలను సందర్శించారు. గత 14 ఏళ్ళుగా జీవీఎంసీతో కలిసి చేస్తున్న మురికివాడల అభివృద్ధి, చెత్త సేకరణ కార్మికులు, వీధి వ్యాపారుల గుర్తింపు, నిరాశ్రయులకు షెల్టర్ల ద్వారా అందిస్తున్న సేవలన్నీ కూడా ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఏయూటీడీ సిబ్బంది కె.జ్యోతిర్మయి, లీలా, శ్రీను, ప్రశాంత్ పాల్గొన్నారు.





వాసవీ మాత విగ్రహాన్ని ఊరేగిస్తున్న ఆర్య వైశ్యులు, ఆత్మార్పణ అలంకరణలో అమ్మవారు

ఘనంగా కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం

మహారాణిపేట/జగదాంబ కూడలి, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్‌లోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు, ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో అమ్మవారికి 108 సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అలాగే స్వర్ణ పుష్పార్చన జరిపారు. అనంతరం 102 మంది ఆర్యవైశ్య దంపతులు జగన్నాథస్వామి ఆలయం నుంచి కన్యకా పరమేశ్వరి ఆలయం వరకు ఏకరూప దుస్తులతో ఊరేగింపు చేపట్టారు. మధ్యాహ్నం నారాయణ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో కంకటాల మల్లిక్, పైడా కృష్ణప్రసాద్ ఆరిశెట్టి దినకర్, తదితరులు పాల్గొన్నారు.

మూలకు చేరిన ఆర్వో ప్లాంట్లు

అక్కయ్యపాలెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26, 42 వార్డుల్లోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు మూలకు చేరాయి. గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకం కింద ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్లతో తాగునీటి సమస్య ఉండదనుకున్నా, కొద్ది రోజులకే మరమ్మతులు కావడంతో ఎక్కడివక్కడే వదిలేశారు. 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ పాఠశాలలో మరమ్మతులకు గురైన ప్లాంట్ ఇంతవరకు బాగుపడలేదు. వీటికోసం వెచ్చించిన లక్షలాది రూపాయలు వృథా అయ్యాయి. 42వ వార్డు రైల్వే న్యూకాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని కృష్ణవేణి సొంత డబ్బు వెచ్చించి బాగుచేయించినా నిరుపయోగంగా మిగిలింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్వో ప్లాంట్లు బాగు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పూజలకు అనుమతి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జగదాంబ కూడలి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో సంప్రదాయం ప్రకారం పూజలు చేసుకోవడానికి భక్తులకు అనుమతిచ్చారు. భక్తులు నేరుగా అమ్మవారికి పాల, జలాభిషేకాలు చేయడంతో పాటు పసుపు, కుంకుమ, పూలు, మొక్కుబడి చీరలను అమ్మవారి వద్ద ఉంచి పూజ చేయడం ఆనవాయితీ. అందుకు విరుద్ధంగా అధికారులు మార్గశిర మాసోత్సవాలు, గురు, శుక్రవారం, ప్రత్యేక రోజుల్లో భక్తుల తాకిడిని బట్టి మూలవిరాట్ వద్ద తాళ్లను కట్టి భక్తులను పూజలకు దూరం చేశారు. దీంతో పలువురు తీవ్ర మనస్తాపానికి లోనయ్యారు. భక్తులు స్వయంగా అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకునే అవకాశం కోల్పోయారు. దీనిపై 'పూజల్లో ఆలయ సిబ్బంది జోక్యం' అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో ఈవో శోభారాణి, ఆలయ సూపరింటెండెంట్లు స్పందించి చర్యలకు దిగారు. గురు, శుక్రవారం భక్తులు నేరుగా గర్భగుడిలో అమ్మవారికి పూజలు చేసుకునే అవకాశం కల్పించారు.దీంతో పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎండాడ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు.పీఎంపాలెం పోలీసుల వివరాలు ప్రకారం..కొమ్మాది వైఎస్సార్ కాలనీలో నివాసం ఉంటున్న దిమిలి సూరిబాబు (43) కార్పెంటర్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిస కావడంతో ఈనెల 28న ఇంటి మెట్లు ఎక్కుతుండగా జారి పడడంతో తలకు గాయమైంది. కుటుంబ సభ్యులు వెంటనే గాయత్రి ఆసుపత్రికి తర లించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్‌కి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు పరమేశ్వరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేశారు.

'ఉక్కుపై కేంద్ర మంత్రి ప్రకటనలో స్పష్టత ఏదీ?'

జగదాంబ కూడలి,జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణపై కేంద్ర మంత్రి కుమారస్వామి ఎలాంటి స్పష్టత ఇచ్చారని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ ఎస్‌వీ కుమార్ ప్రశ్నించారు. శుక్రవారం సంఘ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉక్కుపై కేంద్ర మంత్రి కుమారస్వామి, సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో కార్మికులు ఆందోళనకు గురవుతున్నారని విమర్శించారు. ఉక్కు సందర్శనకు వచ్చిన కేంద్ర మంత్రి కుమారస్వామి కర్మాగారాన్ని పరిరక్షిస్తామని అన్నారని, అంతకుమించి ఎటువంటి స్పష్టత ఇవ్వకపోవడం వెనుక మర్మమేటని ప్రశ్నించారు.ప్యాకేజీ వల్ల ఉక్కుకు ఒరిగేది శూన్యమని విమర్శించారు. కొన్ని విభాగాలను ప్రైవేట్‌పరం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని, ఇప్పటికే అగ్నిమాక కేంద్రం నిర్వహణ ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారన్నారు. ఇదే తరహాలో మరికొన్ని విభాగాలను ఇవ్వనున్నట్టు ఆరోపించారు.

7న ఎస్సీ వర్గీకరణపై 'లక్ష డప్పులు, వేల గొంతులు'



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

సీతంపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఈనెల 7న లక్ష డప్పులు, వేల గొంతులు పేరుతో మాదిగల భారీ సాంస్కృతిక ప్రదర్శన ర్యాలీని, సభ నిర్వహించనున్నట్టు ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు పేర్కొన్నారు. ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. గత ఏడాది ఆగస్టులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు రాష్ట్రాలు వర్గీకరణ చేయాల్సి ఉండగా కావాలనే జాప్యం చేస్తున్నాయని ఆరోపించారు. 30 ఏళ్లుగా చేస్తున్న సుదీర్ఘ పోరాటం చివరి దశకు వచ్చిందని, లక్ష డప్పులు, వేల గొంతుల కార్యక్రమం ద్వారా వర్గీకరణ జరిగి తీరుతుందన్నారు. అనంతరం నాయకులు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజూరి దీపక్, కింతాడ రాజశేఖర్, అత్తోట రవికుమార్, ఉప్పలపాటి దానమయ్య, తొత్రం మూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉక్కు రిలే దీక్షల కార్యాచరణ

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో రోజువారీగీ పాల్గొనే యూనియన్‌ల జాబితాను ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు శుక్రవారం ప్రకటించారు. ఇందులో భాగంగా ఫిబ్రవరి 1, 5, 8, 14, 19, 22, 27 తేదీల్లో ఇంటక్, 3, 6, 10, 15, 20, 24, 28 తేదీల్లో సీఐటీయూ, 4, 7, 11, 17, 21, 26 తేదీల్లో ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు దీక్షల్లో పాల్గొంటారు. అలాగే రెండో తేదీన కాంట్రాక్టు కార్మికులు (ఇంటక్), 9న కాంట్రాక్టు కార్మికులు (సీఐటీయూ), 12న ఓబీసీ అసోసియేషన్, 13న 29న యూజ్, డీఐటీయూ, జేఎంఎస్, వీఎస్ఎంఎస్, వీఎస్ఈయూ, వీఎస్‌పీయూఈ, 18న డీఎస్ఈయూ, టీఎన్‌టీయూసీ, 23న కాంట్రాక్టు కార్మికులు (టీఎన్‌టీయూసీ), 25న సీఎఫ్‌టీయూఐ యూనియన్ల నాయకులు, కార్మికులు వారీగా దీక్షల్లో కూర్చుంటారు.

విద్యుత్ అంతరాయంపై ప్రజల ఆవేదన

మల్కాపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం సబ్ స్టేషన్ అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వకుండా శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరున్నర గంటల వరకు వివిధ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేయడంపై ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. అచ్చినాయుడు తోటలో నిర్మించిన టిడ్కో ఇళ్లకు 33కేవీ విద్యుత్ కనెక్షన్ ఇచ్చే నిమిత్తం సుమారు 9 గంటల పాటు విద్యుత్ సరఫరాను నిలిపివేయడం దారుణమని వాపోయారు. టిడ్కో ఇళ్లకు విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయడం మంచిదే అయినప్పటికీ ముందుగా ఎటువంటి ప్రకటన చేయకపోవడం పట్ల పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

ఉత్సాహంగా ఉత్సవ్

... 3వ పేజీ తరువాయి

లభించింది.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

ప్రధాన వేదికపై శుక్రవారం సాయంత్రం ప్రదర్శించిన బస్తార్ బంద్, తోడా, గోండు ట్రైబ్స్ నృత్యం, తప్పెటగుళ్లు, కొమ్ముకోయ, సవర నృత్యం, జాతపు నృత్యం, చెక్క భజన, జముకు పేట, మణిపూర్ సంప్రదాయ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ఆన్‌లైన్‌లో ఇంటర్ హాల్ టికెట్లు

... 3వ పేజీ తరువాయి

బకాయిలున్న విద్యార్థులకు హాల్‌టికెట్లు నిరాకరించేవారు. పరీక్షల ముందు రోజు వరకు ఫీజుల కోసం వేధించడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యేవారు. తాజాగా ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలకు హాజరయ్యే అవకాశం కల్పించారు.

హాల్‌టికెట్లపై ఎవరి సంతకాలు అవసరంలేదని, ప్రింట్ తీసుకువస్తే పరీక్షలకు అనుమతిస్తారని అధికారులు తెలిపారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు పుట్టిన తేదీ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పుట్టిన తేదీ లేదా మొదటి సంవత్సరం హాల్‌టికెట్ నంబరు నమోదు చేస్తే హాల్‌టికెట్ డౌన్‌లోడు చేసుకోవచ్చునని వివరించారు.

ఫ్రీ హోల్డ్‌లో అవకతవకలు

... 3వ పేజీ తరువాయి

పశువులు/గొర్రెలు/మేకల మేత కోసం ఎంపిక చేసిన బీడు భూములకు డీపట్టాలు ఇవ్వకూడదు. అయితే మూడు దశాబ్దాల క్రితం అప్పటి అధికారులు రామవరంలో గల ఆ 7.5 ఎకరాలకు డీపట్టాలు ఇచ్చారు. ఆ భూముల్లో రైతులు తోటలు పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం 2023 డిసెంబరులో జారీచేసిన జీవో మేరకు మేకల మేత బీడుగా ఉన్న ఆ 7.5 ఎకరాల డీపట్టా భూములకు ఫ్రీ హోల్డ్ సర్టిఫికెట్లు అయ్యాయి. దీనిపై అప్పట్లో రైతులు అభ్యంతరం వ్యక్తంచేశారు. అయితే వైసీపీ నేతల దన్ను ఉండడంతో రైతుల అభ్యంతరాలను మండల రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. రామవరం, కోలవానిపాలెం, భీమన్నదొరపాలెం గ్రామాల్లో పలు సర్వే నంబర్లలో గల డీపట్టా భూములు చాలాకాలం క్రితమే చేతులు మారాయి. రెండున్నర దశాబ్దాల క్రితం అప్పటి అధికారులు విచారణ జరిపి చేతులు మారిన భూములకు సంబంధించి డీపట్టాలు రద్దు చేశారు. అప్పట్లో రద్దు చేసిన డీపట్టా భూముల్లో కొన్నింటికి గత ఏడాది ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు ఇచ్చారనే వాదన వినిపిస్తోంది. రెండున్నర దశాబ్దాల క్రితం డీపట్టాల రద్దుకు సంబంధించి రికార్డులు ప్రస్తుతం లభ్యం కావడం లేదని తెలిసింది. అప్పట్లో భూములు కొనుగోలు చేసిన బడాబాబులు డీపట్టా భూములను తమ ఆధీనంలోనే ఉంచుకుని తోటలు పెంచారు.

ఇదిలావుండగా జిల్లాలో ఎనిమిది ఎకరాలకు సంబంధించి ఫ్రీహోల్డ్ అనుమతుల మంజూరులో నిబంధనలు పాటించలేదని జిల్లా అధికారులు గుర్తించారు. రామవరంలో 7.5 ఎకరాల మేకల బీడు, పాలవలసలో 45 సెంట్ల రాస్తాకు ఫ్రీ హోల్డ్ అనుమతులు ఇచ్చారని ప్రభుత్వానికి నివేదించారు.

రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిట

... 3వ పేజీ తరువాయి

రోజుకు 20కి మించి డాక్యుమెంట్లు రిజిస్టర్ కావు. అక్కడ అన్నీ వ్యవసాయ భూములే కావడంతో పెద్దగా లావాదేవీలు జరగవు. అయితే ధరలు పెరుగుతున్న నేపథ్యంలో భారీగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. గురువారం 58, శుక్రవారం 98 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేసినట్టు సబ్ రిజిస్ట్రార్ ఆనంద్‌కుమార్ తెలిపారు.గాజువాకలో గురు వారం 53, శుక్రవారం 98 డాక్యుమెంట్లు రిజిస్టర్ అయినట్టు సబ్ రిజిస్ట్రార్ తారకేశ్ వివరించారు. ఇలా అన్ని కార్యాలయాల్లో రెట్టింపు కంటే ఎక్కువ జరిగాయి. జిల్లా వ్యాప్తంగా చూసుకుంటే గురువారం 663, శుక్రవారం 871 డాక్యుమెంట్లు రిజిస్టర్ అయినట్టు జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర తెలిపారు. అయితే ఎక్కువ డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయడం వల్ల సర్వర్ ఇబ్బంది పెట్టింది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి ప్రక్రియ ఆగిపోయింది. అధికారులు, సిబ్బంది రాత్రి పది గంటల వరకు ఉండి వచ్చిన డాక్యుమెంట్లన్నింటినీ రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు.

సిబ్బంది తగ్గాలట, ఉత్పత్తి పెరగాలట!

... 3వ పేజీ తరువాయి

కార్మికులను నిలిపివేశారు. ఇంకో వేయి మందిని ఆపేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ కార్మికులు అన్ని విభాగాల్లో కీలకమైన పనులు చేస్తారు.

సింటర్ ప్లాంటు, బ్లాస్ట్‌ఫర్నేస్‌లు, కోక్ ఓవెన్ల వంటి విభాగాల్లో 30 శాతం తగ్గించేస్తే అక్కడ పనులు చేసే వారు ఉండరు. ఆయా పనులను ఎగ్జిక్యూటివ్‌లు కానీ, నాన్ ఎగ్జిక్యూటివ్‌లు కానీ చేయరు. చేయలేరు. దానివల్ల అక్కడ ఉత్పత్తి ప్రక్రియ మందగిస్తుంది. ఆశించిన లక్ష్యాలు సాధించడం కుదరదు. అన్నిచోట్ల ఒకేలా వ్యవహరించడం తగదని ఆయా విభాగాల అధికారులు చెబుతున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదు. ఇటీవల సింటర్ ప్లాంటులో క్లీనింగ్ సిబ్బందిని తీసేశారని, దానివల్ల కన్వేయర్ల వద్ద ఇబ్బందులు వస్తున్నాయని, కాంట్రాక్ట్ సిబ్బందిని నియమించాలని ఏడు నెలల క్రితమే ఆ విభాగం యాజమాన్యానికి లేఖలు రాసినా పట్టించుకోలేదు. దానికి భారీ మూల్యం చెల్లించుకోవలసి వచ్చింది.

ఇకపై జరిగే ప్రమాదాలకు కూడా ఇవే ప్రధాన కారణాలుగా నిలుస్తాయని అధికార వర్గాలు చెబుతున్నాయి.

పేదలకు ఉపశమనం

... 3వ పేజీ తరువాయి

వరకు భూమి విలువ 100 శాతం, 50 శాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని ప్రభుత్వం పేర్కొంది.

ఇవీ మార్గదర్శకాలు

భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం పలు మార్గదర్శకాలు జారీచేసింది. ఆధార్ కార్డు కలిగి ఉండాలి. గ్రామీణ ప్రాంతంలో కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.2 లక్షలు, పట్టణాల్లో రూ.1.44 లక్షలు మించకూడదు. సొంతంగా కారుంటే క్రమబద్ధీకరణకు అర్హత ఉండదు. అయితే జీవనోపాధికి ట్యాక్సీ, వ్యవసాయం కోసం ట్రాక్టర్ సొంతంగా సమకూర్చుకున్నా అనుమతిస్తారు. మెట్ట, మాగాణి కలిసి ఐదెకరాలకు మించకూడదు.

అధిక ఆదాయం ఉన్న వారికి కూడా 150 గజాల వరకు ఉచితంగానే క్రమబద్ధీకరిస్తారు. 151 నుంచి 300 గజాల వరకు క్రమబద్ధీకరణ కోరితే భూమి విలువలో 15 శాతం ఫీజు, పూర్తిగా రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. 301 నుంచి 450 గజాల వరకు భూమి విలువలో 200 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజులు అక్కడ ఉన్న ధరల మేరకు చెల్లించాల్సి ఉంటుంది.

25 వేల మందికి ఉపశమనం

నగరంతోపాటు పరిసరాల ప్రాంతాల్లో కొండలు, కొండవాలు ప్రాంతాలు, ప్రభుత్వ ఖాళీ స్థలాలను ఆక్రమించుకుని వేలాది మంది ఇళ్లు నిర్మించుకున్నారు. గత టీడీపీ హయాంలో ఇచ్చిన జీవో 296 మేరకు నగరంలో 83,891 మంది క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేయగా 46,526 మందిని అర్హులుగా గుర్తించి పట్టాలిచ్చారు. మరో 544 మందికి పట్టాలు జారీచేసే ప్రక్రియ పెండింగ్‌లో ఉండిపోయింది. 36,821 దరఖాస్తులను తిరస్కరించారు. ఇంకా 388 జీవో మేరకు 53,347 మంది దరఖాస్తు చేయగా 8,687 మంది అర్హులని తేల్చారు.వీరిలో 7,030 మంది క్రమబద్ధీకరణకు డబ్బు చెల్లించడంతో పట్టాలిచ్చారు. అయితే 296, 388 జీవో మేరకు క్రమబద్ధీకరణ చేసిన రెండేళ్లలో కన్వేయన్స్ డీడ్ ఇవ్వాలి. కానీ 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత దీనిని పూర్తిగా పక్కనపెట్టేసింది. తాజాగా వారందరికీ కన్వేయన్స్ డీడ్స్ ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పాటు గతంలో క్రమబద్ధీకరణ జీవో మేరకు దరఖాస్తు చేయని వారంతా మరోసారి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది.

పలాస, పార్వతీపురం పాసింజర్ రైళ్ల గమ్యాల కుదింపు

విశాఖపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక కారణాల వలన విశాఖ-పార్వతీపురం మధ్య నడిచే 67287, 67288 నంబర్లు గల పాసింజర్ రైళ్లు ఈనెల ఒకటి నుంచి మార్చి ఒకటి వరకు విశాఖ-విజయనగరం మధ్య రాకపోకలు సాగిస్తాయని, విజయనగరం-పార్వతీపురం మధ్య రాకపోకలను తాత్కాలికంగా రద్దు చేశామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

అలాగే విశాఖ-పలాస మధ్యనడిచే 67289, 67290 నంబర్లు గల పాసింజర్ రైళ్లు ఈనెల ఒకటి నుంచి 28వ తేదీ వరకు విశాఖ-శ్రీకాకుళం రోడ్డు మధ్య రాకపోకలు నడుస్తాయని, శ్రీకాకుళం రోడ్డు-పలాస మధ్య రాకపోకలను తాత్కాలికంగా రద్దు చేశామని పేర్కొన్నారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.

ఏయూను సందర్శించిన ఐఐఎస్సీ ఆచార్యులు



వెంకోజీపాలెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (బెంగళూర్) ఆచార్యులు డాక్టర్ ఎస్సీ శివప్రకాష్ ఏయూను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ జి.శశిభూషణరావును మర్యాదపూర్వకంగా కలిసి ఏయూ ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ శివప్రకాష్‌ను ఏయూ తరపున వీసీ సత్కరించారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ ఆచార్య కె.ఈశ్వర్‌కుమార్, అడ్మిషన్స్ డైరెక్టర్ ఆచార్య డి.ఏ.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై ఆర్డీవో ఫిర్యాదు

పెందుర్తి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం విధి నిర్వహణలో ఉన్న తన పనులకు ఆటంకం కలిగించడంతో పాటు దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై విశాఖ ఆర్డీవో శ్రీలేఖ శుక్రవారం పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశారు. సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

పెందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో జనవరి 27న నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఆర్డీవో హాజరై ప్రజల నుంచి అర్జీల స్వీకరణ చేపట్టారు. ఈ క్రమంలో మురళీనగర్‌కు చెందిన డీవీ మహేశ్ అనే వ్యక్తి వేపగుంటలోని ఓ స్థల సమస్యకుసంబంధించిన పత్రాలతో వచ్చాడు. ఆయనకు కాసేపు వేచివుండాలని సిబ్బంది తెలిపారు. దీంతో సదరు వ్యక్తి తన ఎదుట అసహనం వ్యక్తం చేయడంతో పాటు విధులకు ఆటంకం కలిగించి. దురుసుగా ప్రవర్తించాడని.. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ ఆర్డీవో పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మహేశ్‌పై కేసు నమోదు చేసినట్టు సీఐ పేర్కొన్నారు.

సినిమా గైడ్

- **మదగజరాజ :** జగదాంబ, సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **మహిష :** రమాదేవి
- **సంక్రాంతికి వస్తున్నాం :** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, మోహిని కాంప్లెక్స్ శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం),కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 30, టమాటా 12, వంకాయలు (తెలుపు)20, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 46, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 46, బీరకాయలు 50, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 12, క్యాబేజి 14, క్యారెట్ 28 దొండకాయలు 36, బంగాళ దుంపలు 22, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 110, అల్లం (పాతది)44, బరబాటి 34, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 62, బద్దచిక్కుడు 24, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 44, పొటల్స్ 80, కీర దోస 32, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 436 చిలగడ దుంపలు 36, కంద 56, దేముడు చిక్కుడు 24, గోరు చిక్కుడు 26, ఆగాకార దేశవాళి 100 , ఆగాకర హైబ్రిడ్ 50, కూర పెండలం 26, బ్రకోలి 70 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 60, కరివేపాకు(కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 18, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	95
లైవ్ ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210

చంద్రబాబు, పవన్ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం

» సర్వేనెం.275లో గల భూముల క్రమబద్ధీకరణపై హర్షం

» 15వ వార్డులో హర్షాతిరేకాలు

వెంకోజీపాలెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానం భూములకు సంబంధించి సర్వే నెం.275లో గల భూముల క్రమబద్ధీకరణ, పంచగ్రామాల సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్న కూటమి ప్రభుత్వానికి 15వ వార్డు కొండవాలు ప్రాంత వాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. శుక్రవారం హెచ్‌బీకాలనీ జంక్షన్‌లో టీడీపీ 15వ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ ఆధ్వర్యంలో కూటమి నాయకులు, లబ్ధిదారులు సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం నిర్వహించారు. దేవస్థానంతో సంబంధం, ఇబ్బంది లేకుండా ఎవరికి వారే ఇండ్లను నిర్మించుకునే విధంగా అవకాశాన్ని కల్పిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఎన్నికల హామీ ప్రకారం తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి.రామకృష్ణబాబు, భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఈ సమస్య పరిష్కారానికి కృషి చేయడం ప్రజలు, స్థానిక సమస్యలపై వారికున్న నిబద్ధత అని కొనియాడారు. ఒకరికొకరు మిఠాయిలను తినిపించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ 15వ వార్డు ప్రధాన కార్యదర్శి, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, సూరిబాబు, గౌరీ, వరలక్ష్మి, కె.మహేష్, జనసేన యడ్ల కళావతి, పి.సాయిబాబా, కె.నరసింగరావు పాల్గొన్నారు.



చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం నిర్వహిస్తున్న కొండవాలు ప్రాంత వాసులు

ప్రసాదరెడ్డి అవినీతిపై విచారణ చేపట్టాలి

ఏయూ వీసీకి ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ పూర్వ విద్యార్థులు సంఘం వినతి



వీసీ శశిభూషణరావుకు వినతిపత్రం అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

వెంకోజీపాలెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఏయూలో గత ఉపకులపతి పీవీజీడీ ప్రసాదరావు హయాంలో జరిగిన అవకతవకలు, ఏయూ టీడీఆర్ హబ్‌కు సంబంధించిన పీహెచ్‌డీల విషయంలో బాధ్యులపై చర్యలు చేపట్టాలని కోరుతూ ఏయూ వీసీ జి.శశిభూషణరావుకు శుక్రవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పూర్వ విద్యారులు సంక్షేమ సంఘం సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఏయూ టీడీఆర్ హబ్‌కు డీన్‌గా వ్యవహరించిన డాక్టర్ జేమ్స్ స్టీఫెన్ అక్రమంగా, నిబంధనలను వ్యతిరేకంగా అంతా తానై యూనివర్సిటీ నిబంధనలు అతిక్రమించి ప్రీపీహెచ్‌డీ పరీక్షల పేపర్ తయారీ, పేపర్ వాల్యూయేషన్ చూసి అక్రమాలకు పాల్పడ్డారని, అతనిపై చర్యలు తీసుకోవాలని వీసీని కోరారు. ఏయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్‌గా మూడు సంవత్సరాల కాలపరిమితికి చేరిన డాక్టర్ ఎం.జేమ్‌స్టీఫెన్‌ను తక్షణమే తొలగించి ఇన్‌చార్జిగా రెగ్యులర్ ప్రొఫెసర్‌కు బాధ్యతలు అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోటి జాన్, కార్యదరి ఆరేటి మహేష్, టి.సురేష్‌కుమార్, సురేంద్ర, బి.కృష్ణ, యూవీ రమణ తదితరులు ఉన్నారు.

జాతీయ బీచ్ వాలీబాల్ టోర్నీకి ఆంధ్ర జట్టు



జాతీయ బీచ్ వాలీబాల్ టోర్నీలో పాల్గొననున్న పురుషులు, మహిళల జట్లు

విశాఖపట్నం, స్పోర్ట్స్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : జాతీయ క్రీడల బీచ్ వాలీబాల్ పోటీల్లో పాల్గొనే ఆంధ్ర పురుషుల, మహిళల జట్ల సభ్యులను శుక్రవారం ప్రకటించారు. పురుషుల విభాగంలో కృష్ణంరాజు, నరేష్, మణికంఠరాజు...మహిళల విభాగంలో మానస, మౌనిక, దివ్యసాయి ప్రాతినిధ్యం వహించనున్నారు. పురుషుల జట్టుకు రక్షణకుమార్, మహిళల జట్టుకు రంజని కోచ్‌లుగా, ఇరు జట్లకు మేనేజర్‌గా భగవాన్‌దాస్ వ్యవహరించనున్నారు. ఉత్తరాఖండ్, డెహ్రాడూన్‌లో జరిగే ఈ టోర్నీలో పాల్గొనే క్రీడాకారులకు గత వారం రోజులుగా రామకృష్ణ బీచ్ వద్ద జరిగిన శిక్షణా శిబిరం శుక్రవారం ముగిసింది. శిక్షణాశిబిరం ముగింపు కార్యక్రమానికి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కేవీ బాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులు క్రీడా దుస్తులు అందజేసి ప్రతిష్ఠాత్మక టోర్నీలో ఆంధ్రాకు పతకం అందించాలని ఆకాంక్షించారు. కాగా టోర్నీలో పాల్గొనేందుకు అయ్యే రవాణా చార్జీలు,ఇతర ఖర్చులకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ వాలీబాల్ సంఘం రూ.90 వేలను జట్ల సభ్యులకు అందించిందని జిల్లా వాలీబాల్ సంఘం కార్యదర్శి రక్షణకుమార్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వాలీబాల్ సంఘం కార్యదర్శి టీవీ భగవాన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం



పదవీ విరమణ పొందనున్న ఉద్యోగులను సన్మానిస్తున్న జీవీఎంసీ ఏడీఏ రమణమూర్తి

వెంకోజీపాలెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీలో వివిధ హోదాలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న 11 మంది అధికారులు, ఉద్యోగులను శుక్రవారం జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి చేతుల మీదుగా సత్కరించారు.

ఈ సందర్భంగా ఏడీసీ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన వారంతా శేష జీవితాన్ని చక్కగా గడపాలన్నారు. సత్కారం అందుకున్న వారిలో పర్యవేక్షక ఇంజనీరు కె.రామ్మోహనరావు, ప్రాజెక్టు అధికారి బి.రమణమ్మ, సీనియర్ అసిస్టెంట్ వై.మల్లేశ్వరరావు, పీహెచ్ వర్కర్లు కె.సోమయ్య, పోలమ్మ, ఎన్.ఆదినారాయణరావు, పి.పెద్ద అప్పిలి, ఎమ్.టి.ఎస్.ఉద్యోగులు బి.పాపారావు, పి.అప్పారావు, బాల్యం టీచరు ఎం.అన్నమ్మని, ఆయా ఎస్.సత్యవతి ఉన్నారు. ఉద్యోగులకు ప్రావిడెండ్ ఫండ్ సొమ్మును రూ.66 లక్షల 5 వేల 732 లను ఏడీసీ అందజేశారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

శ్రీసత్యసాయి ప్రేమసదన్ మందిర్ ప్రారంభం



మహిళలకు కుట్టు మిషన్లు అందిస్తున్న రత్నాకర్ తదితరులు

ఎంవీపీ కాలనీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : భగవాన్ శ్రీసత్యసాయిబాబా శతాబ్ది ఉత్సవాలలో భాగంగా శ్రీసత్యసాయి ప్రేమసదన్ మందిర్‌ను శుక్రవారం శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ జె.రత్నాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జీవనోపాధి కార్యక్రమాల ద్వారా మహిళలకు ఆర్థిక భరోసా అందించేందుకు దోహదపడే పలు వృత్తి ఆధారిత పనిముట్లు పంపిణీ చేశారు. కొత్తగా పునరుద్ధరించిన సత్యసాయి ప్రేమసదన్ మందిర్ ప్రారంభోత్సవంలో హిమవాహినీ రత్నాకర్ పాల్గొన్నారు. అనంతరం ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల వివిధ విభాగాల అధిపతులు, ప్రతినిధులు కోటీశ్వరరావు, చలం, ఆర్.లక్ష్మణరావు, పిఆర్ఎస్ఎన్ నాయుడు, డీవీవీ సీతారామరాజు పాల్గొన్నారు.

టీడీఆర్ హబ్ రద్దుపై హర్షం

వెంకోజీపాలెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : టీడీఆర్ హబ్ రద్దుపై ఏయూ పరిరక్షణ సమితి హర్షం వ్యక్తం చేసింది. యూజీసీ నియమాలకు విరుద్ధంగా జరిగిన పీహెచ్‌డీలను నిలిపివేసినందుకు అభినందనలు తెలిపింది. సుమారు 679 మంది పరిశోధకులకు న్యాయం జరిగే విధంగా యూనివర్సిటీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఏయూ పీజీ ప్రవేశాలకు పూర్వ పద్ధతిలోనే ఆసెట్ నిర్వహించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. స్టేట్ లెవెల్ ఎంట్రన్స్ టెస్ట్ వలన లోకల్ అభ్యర్థులు తీవ్రంగా నష్టం జరుగుతోందని, అందువల్ల ఏయూ కామన్ అడ్మిషన్ పరీక్ష నిర్వహించాలని కోరారు. ఏయూకు సీనియర్ ప్రొఫెసర్‌నే వీసీగా నియమించాలని, చిన్న యూనివర్సిటీలు పరిపాలన అనుభవం తక్కువగా ఉంటుందని, ఉన్నత విద్యపై ప్రయోగాలు వద్దని సమితి ప్రతినిధులు హితవు పలికారు. గత ప్రభుత్వంలో ఉన్నత విద్య అనేక రకాలుగా నష్టపోయిందని, ఆ నష్టాన్ని భర్తీ చేసే ఆలోచన చేయాలని, రాజకీయ నాయకులు యూనివర్సిటీని పరిపాలనలో తలదూర్చకపోతే యూనివర్సిటీ సీనియర్ ఆచార్యులు ఏయూని ప్రపంచ స్థాయికి తీసుకుని వెళతారన్నారని సమితి అధ్యక్షులు సురేష్ మీనన్, కార్యదర్శి శ్రీనివాసరావులు ప్రకటన ద్వారా తెలియజేశారు.

ఉక్కు దీక్షా శిబిరం కొనసాగింపుపై తర్జనభర్జన?

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం కూర్మన్నపాలెం ఆర్చి వద్ద ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని కొనసాగించాలా, వద్దా.. అనే అంశంపై నాయకులు తర్జనభర్జన పడుతున్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాదని, ఉక్కు కర్మాగారానికి కేంద్రం పూర్తిగా సహకరిస్తుందని, ప్లాంట్ అతి తక్కువ కాలంలోనే అన్ని రంగాల్లో ప్రగతి సాధించేందుకు సహకారాన్ని అందిస్తామని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, ఉక్కుశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మలు గురువారం స్పష్టం చేశారు. అదేవిధంగా ఇప్పటికే ప్లాంటుకు కేంద్రం భారీ ప్యాకేజీని ప్రకటించింది. ఈ నేపథ్యంలో దీక్షా శిబిరాన్ని ఎత్తివేయాలన్న డిమాండ్ ఉన్నప్పటికీ కొంత మంది మాత్రం కొనసాగించాలని పట్టుబడుతున్నట్టు తెలిసింది. అయితే దీక్షా శిబిరం కొనసాగింపు వల్ల ఎటువంటి ప్రయోజనం లేదని, ఉక్కు కర్మాగారానికి కేంద్రం సహకరిస్తున్నప్పుడు దీక్షల కొనసాగింపు ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు.

నేటి నుంచి వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ పోటీలు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మెడ్‌టెక్ జోన్‌లో ఫిబ్రవరి 1, 2 తేదీల్లో వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించనున్నారు. ఆర్థోటిక్స్, ప్రోస్తెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఓపీఏఐ) ఆధ్వర్యంలో వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూబీఎఫ్ఐ) సహకారంతో ఈ పోటీలు జరగనున్నాయి. అదేవిధంగా ఓపీఏఐ 28వ సమావేశాన్ని నిర్వహించనున్నారు.

ప్రతి నెలా జీతాలు చెల్లించాలి

ఏయూ వీసీ, రిజిస్ట్రార్‌లకు గెస్ట్ లెక్చరర్ల వినతి



రిజిస్ట్రార్ ధనుంజయరావుకు వినతి పత్రం ఇస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీ సభ్యులు

వెంకోజీపాలెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఏయూలో అతిథి అధ్యాపకులుగా పనిచేస్తున్న అర్హత కలిగి, అనేక పరిశోధన పత్రాలు, సిక్స్‌మెన్ కమిటీతో నియమించిన అందరికీ నెలవారీవేతనాలు ఇవ్వాలని ఏయూ వీసీ జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఈఎస్ ధనుంజయ్‌రావును శుక్రవారం గెస్ట్ ఫ్యాకల్టీ సభ్యులు కలిసి వినతిపత్రం అందజేశారు. అతిథి అధ్యాపకులకు టీడీఎస్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఆదికవి నన్నయ్య డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, నన్నయ్య యూనివర్సిటీల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులు కూడా టీడీఎస్ నుంచి మినహాయింపు ఇచ్చారని చెప్పారు. ఏయూ పీజీ ప్రవేశాలను ఆసెట్ ద్వారా నిర్వహించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర కామన్ ప్రవేశ పరీక్ష వలన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అందువల్ల ఆసెట్ నిర్వహించాలని కోరారు. అదే రకంగా దివ్యాంగులకు డిజేబులిటీ సెల్‌కు డీన్‌ని నియమించాలని, తిరిగి సెల్ పనిచేసే విధంగా చూడాలని వీసీని, రిజిస్ట్రార్‌ను కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.సురేష్‌మీనన్, డాక్టర్ దాస్, డాక్టర్ శిరీష్, విక్రం మైకేల్, సురేంద్ర, దేవానంద్, డాక్టర్ శ్రీనివాస్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

జూలో విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు



పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఆరిలోవ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ జీబ్రాల దినోత్సవం సందర్భంగా ఇందిరా గాంధీ జంతు ప్రదర్శన శాలలో శుక్రవారం విద్యార్థులకు పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలో ఎల్‌కేజీ నుంచి పోస్టు గ్రాడ్యుయేషన్ వరకు చదువుతున్న విద్యార్థులు పాలొని తమ సృజనాత్మకతను ప్రదర్శించారు.

ప్రస్తుతం ఇక్కడి జూలో ఉన్న జీబ్రాలను 2019లో కోల్‌కతాలోని ఆలిపూర్ జూ నుంచి జంతుమార్పిడి విధానంలో తెచ్చినట్టు జూ క్యూరేటర్ మంగమ్మ తెలిపారు. జీబ్రాలు సాధారణంగా గోధుమ ఊక, పిండి చేసిన భారతీయ బియ్యం, శెనగలు, పిండిచేసిన బార్లి క్యారెట్, ఎండుగడ్డి ఓట్స్ వంటి ఆహారం తీసుకుంటాయని తెలిపారు. దీని జీవిత కాలం సుమారు 20 నుండి 25 ఏళ్లు అని చెప్పారు.



స్టీల్‌ప్లాంటును పరిరక్షించాలంటూ నినాదాలు చేస్తున్న లక్ష్మి తదితరులు

స్టీల్‌ప్లాంటుకు సొంత గనులు కేటాయించాలి

» పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మి

సిరిపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ కాదంటూ కేంద్ర ప్రభుత్వం కల్లబొల్లి కబుర్లు ఆపి వెంటనే స్పష్టమైన ప్రకటన చేయాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి డిమాండ్ చేయాలి. శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కొనసాగుతున్న దీక్షల్లో పీవోడబ్ల్యూ విశాఖ జిల్లా కమిటీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటు విషయంలో కూటమి ప్రభుత్వం డ్రామాలు ఆడుతోందని విమర్శించారు. స్టీల్‌ప్లాంటుకు సొంత గనులు కేటాయించాలన్నారు. నిర్వాసితులందరికీ శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని, స్వచ్ఛంద పదవీ విరమణ పథకాన్ని రద్దు చేయాలన్నారు. స్టీల్‌ప్లాంటుకు తక్షణమే రూ.15 వేల కోట్లు నిధులు వర్కింగ్ క్యాపిటల్ కింద కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ విశాఖ జిల్లా అధ్యక్షురాలు ఎస్.వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శి డీకేఎస్ రోహిణి, ఉపాధ్యక్షులు కే.బాలనాగమ్మ, కోశాధికారి వరలక్ష్మి, లక్ష్మి, జయమ్మ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం



స్కూలులో ప్రచారం నిర్వహిస్తున్న విజయగౌరి, కుమార్‌మంగళం

మద్దిలపాలెం, జనవరి31(ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీడీఎఫ్ బలపరిచిన విజయగౌరికి తొలి ప్రాధాన్యం ఓటు వేయాలని పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కన్వనర్ కుమార్‌మంగళం కోరారు. మద్దిలపాలెం ఏరియాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో శుక్రవారం పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరితో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యావ్యవస్థలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువస్తున్న నూతన విద్యావిధానం వలన విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు తీవ్ర హాని ఎదురవుతోందన్నారు. ఇప్పటికే అనేక యాప్‌లు ప్రవేశపెట్టి పనిభారాన్ని పెంచారన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేసే అధ్యాపకులకు ప్రభుత్వమే వేజ్‌బోర్డు ఏర్పాటు చేయాలని, హెల్త్ ఇన్సూరెన్స్, 200 గజాల ఇంటి స్థలం కేటాయించాలని డిమాండ్‌తో ముందుకు వెళ్తున్నామన్నారు. ఈ ప్రచారంలో పీడీఎఫ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

భారతదేశం భిన్న సంస్కృతుల సమ్మేళనం

» భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



నృత్యం చేస్తున్న చిన్నారులు

మద్దిలపాలెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : భిన్న సంస్కృతుల సమ్మేళనమే భారతదేశమని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. పీఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన వండర్‌కిడ్స్-25 కళోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో ఒక్కో రాష్ట్రంలో ఒక్కో సంస్కృతి, సంప్రదాయాలు ఉన్నాయన్నారు. దేశంలోని భాషలు, సంస్కృతులు, సంగీత కళలు విద్యార్థులపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వండర్ కిడ్స్ కళోత్సవంలో దేశంలోని ఇతర రాష్ట్రాల సాంప్రదాయ నృత్యాలు ప్రదర్శించిన తీరు అద్భుతమని వర్ణించారు. విద్యార్థులకు అన్ని వర్గాల ఆచారాలు, కళలపై అవగాహన పెంచుతున్న స్కూల్ ఆఫ్ వండర్‌కిడ్స్ డైరెక్టర్ మళ్ల రామునాయుడు, వాణిలను అభినందించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఈవో విజయ్ భాస్కర్, ఏపీపీయూఎస్ఎంఈఓ రాష్ట్ర అధ్యక్షుడు తులసీవిష్ణుప్రసాద్, కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణం కోసం ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అక్కయ్యపాలెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 43వ వార్డు అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలో వేణుగోపాల స్వామి ఆలయ పునర్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకు టీడీపీ వార్డు అధ్యక్షుడు బొడ్డేటి మోహన్ కోరారు.శనివారం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. గత 37 ఏళ్ళ క్రితం నిర్మించిన ఈ ఆలయం శిథిలావస్థకు చేరిందని, దీని పునర్నిర్మాణానికి రూ.67.50 లక్షలు ఖర్చు అవుతుందని దేవదాయశాఖ ఉప కార్యనిర్వాహణ ఇంజనీర్ అంచనా వేశారన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో టీడీపీ యూత్ సెక్రటరీ రాజగిరి కన్నబాబు, నాగరాజు ఉన్నారు.

సెమీస్‌కు చేరిన ఆలిండియా సీనియర్ టెన్నిస్ టోర్నీ

విశాఖపట్నం, స్పోర్ట్సు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆఫీసర్స్ క్లబ్‌లో జరుగుతున్న సీఎంఆర్ అయిస్టా టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీ సెమీఫైనల్స్ దశకు చేరింది. శుక్రవారం జరిగిన 35, 45, 55, 65 ప్లస్ విభాగాల సింగిల్స్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు సెమీస్‌కు చేరారు. శుక్రవారం జరిగిన 70 ప్లస్ డబుల్స్‌లో డీఎస్ఎన్ రాజు-సన్యాసిరాజు 2-1 సెట్లతో డాక్టర్ చంద్రశేఖర్-ఎం.సాయి రాంబాబులపై విజయం సాధించి ఫైనల్స్‌కు చేరారు. సింగిల్స్ 35 ప్లస్ విభాగంలో ఇ.ఈశ్వర్, విజయానంద్, కన్నన్ సేతు; 45 ప్లస్ విభాగంలో పిఎస్.రాజు, జి.రమేష్, రామారావు, ఎంవిఎల్ఎన్.రాజు; 55 ప్లస్‌లో మణికందన్, ఆర్ఎస్.రావత్, ఆర్ఎస్.రమేష్, బిఆర్.సుధాకరరెడ్డి సెమీఫైనల్స్‌కు చేరారు. డబుల్స్‌లో 45 ప్లస్ విభాగంలో ఎంవిఎల్ఎన్.రాజు-కె.బాబ్జి సెమీస్‌లోకి ప్రవేశించారు.

'లేబర్ కోడ్స్ రద్దు చేయాలి'

పూర్ణామార్కెట్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5న సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించనున్నట్టు సంఘం ప్రధాన కార్యదర్శి కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తోందని విమర్శించారు. లేబర్ కోడ్స్ రద్దు అందులో భాగమేనన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాల్లో 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్పు చేసిందని, ఇవి అమల్లోకి వస్తే కార్మికులకు నష్టం తప్పదని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే కార్మిక సంఘాలు సమ్మె నోటీసులు ఇచ్చే అవకాశం కోల్పోతాయని తెలిపారు . ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా 5న నిరసన ర్యాలీలు చేయనున్నట్టు చెప్పారు.

మాఘ మాసోత్సవాలు ప్రారంభం

అల్లిపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వెంకటేశ్వర మెట్టపై వెలసిన అలవేలు మంగమ్మ సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో ఉన్న ఉషా ఛాయాదేవి సమేత సూర్యనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి మాఘ మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అర్చకుడు పాణంగిపల్లి కేశవాచార్యులు మాట్లాడుతూ నాలుగు మాఘ ఆదివారాల్లో ప్రత్యేక అభిషేకాలు జరుపుతామని తెలిపారు. 4న రథ సప్తమి, 8న భీష్మ ఏకాదశి రోజున శ్రీనివాస కల్యాణం, 12న మాఘ పౌర్ణమి రోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని చెప్పారు. .

కృతిమ మేధస్సు పాత్ర కీలకం

సీతంపేట, జనవరి 31, (ఆంధ్రజ్యోతి) : మానవ వనరుల వినియోగంలోనూ, అభివృద్ధిలోనూ కృతిమ మేధస్సు పాత్ర కీలకమని అజినో మోటో బయో ఫార్మా ఉపాధ్యక్షుడు పి. శ్రీనివాస ఠాగూర్ అన్నారు. ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో నేషనల్ హెచ్‌ఆర్‌డీ నెట్ వర్క్ విశాఖ చాప్టర్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం శుక్రవారం వైభవంగా జరిగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు.

గీతంలో ముగిసిన 'జెమ్-25'

సాగర్‌నగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వాణిజ్య విద్యను అభ్యసించే విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలతో పాటు క్రీడా, సాంస్కృతిక నైపుణ్యాలను వెలికితీయడానికి గీతం వర్సిటీ బిజినెస్ స్కూల్ మూడు రోజులుగా నిర్వహిస్తున్న గీతం ఎక్సలెన్స్ మీట్ 25 శుక్రవారంతో ముగిసింది. చివరి రోజు కార్యక్రమానికి స్టాక్ ఎక్స్ఛేంజ్ ఉపాధ్యక్షుడు ఎస్. రంగనాథన్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజాపణి పప్పు మాట్లాడుతూ యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించా లన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు.

మహిళా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న రమణికుమారి, ఉషారాణి, మాధురి, అల్మా, ఝాన్సీరాణి, కుష్బూ తదితరులు

సీతంపేట, జనవరి 31, (ఆంధ్రజ్యోతి) : మహిళలు అన్ని రంగాల్లో ప్రావీణ్యం సంపాదించాలని, అప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని పలు మహిళా సంఘాలు, రాజకీయ పార్టీల మహిళా నేతలు పేర్కొన్నారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో క్వీన్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో మార్చి 7న నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైసీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, క్వీన్ ఈవెంట్స్ ఆర్గనైజర్ ఎం.ఉషారాణి, మను చారిటబుల్ ట్రస్ట్ మనుపల్ల భీమరశెట్టి మాధురి, అల్మా, ఝాన్సీరాణి, కుష్బూ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పేడాడ రమణికుమారి, ఉషారాణి మాట్లాడుతూ మార్చి 7వ తేదిన పది గంటల నుంచి సాయంత్రం వరకు ఆహ్లాదకర వాతావరణంలో మహిళా దినోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతిభావంతులైన పలువురు మహిళలను స్ఫూర్తిదాయక మహిళా అవార్డులతో సత్కరించనున్నట్టు తెలిపారు. డ్యాన్సింగ్ క్వీన్, రెట్రో క్వీన్ పోటీలు, రంబోలా తదితర ఆటల పోటీలను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పోటీలో పాల్గొనదలచిన వారు పూర్తి వివరాల కోసం ఫోన్ : 7842227101లో సంప్రదించాలన్నారు. సమావేశంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

విగ్రహాలకు ముసుగులు, నేతల ఫ్లెక్సీల తొలగింపు


ఫ్లెక్సీలు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సీతమ్మధార, జనవరి 31, (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో జీవీఎంసీ జోన్-3 పరిధిలోని సీతమ్మధార, సీతంపేట, మద్దిలపాలెం, నక్కవానిపాలెం, ఇందిరాప్రియదర్శిని కాలనీ, కేఆర్ఎం కాలనీ తదితర ప్రాంతాల్లో గల రాజకీయ నేతల విగ్రహాలకు క్లాత్‌లు కప్పడంతో పాటు రాజకీయ నాయకులకు సంబంధించిన పోస్టర్లను సచివాలయం టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలగించారు. విగ్రహాల వద్ద గల శిలాఫలకాలపై పేర్లు కనబడకుండా ఉండేలా కాగితాపు చార్టులను అతికించారు.

అయిస్టా చిల్డ్రన్స్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీ ప్రారంభం


చిన్నారులను అభినందిస్తున్న మాజీ డీజీపీ సాంబశివరావు

విశాఖపట్నం, స్పోర్ట్సు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : అయిస్టా నిర్వహిస్తున్న సబ్ జూనియర్ బాలుర, బాలికల టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీ శుక్రవారం ప్రారంభమైంది. ఏయూ టెన్నిస్ సెంటర్‌లో జరుగుతున్న ఈ పోటీలను మాజీ డీజీపీ ఎన్.సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో టోర్నీ డైరెక్టర్ నడింపల్లి కృష్ణంరాజు, ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్సు సైన్సెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.విజయ్‌మోహన్, అయిస్టా ప్రతినిధులు డీఎస్ఎన్.రాజు, ప్రేమ్‌చంద్, కోచ్ కె.బాబ్జి పాల్గొన్నారు.

డీఎస్సీ ప్రకటనపై హర్షం

అక్కయ్యపాలెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ముగియగానే టీచర్ పోస్టుల కోసం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్టు సీఎం చంద్రబాబు ప్రకటించడంపై ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికలు పూర్తయ్యేలోగా జీవో నెంబరు 117పై స్పందించి రద్దుచేయాలని కోరారు.

ఎమ్మెల్యే వంశీకృష్ణ జన్మదినం సందర్భంగా వైద్య శిబిరం


వైద్య శిబిరంలో పాల్గొన కూటమి నాయకులు

సీతంపేట, జనవరి 31, (ఆంధ్రజ్యోతి) : దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ జన్మదినం సందర్భంగా గ్రేటర్ విశాఖ 25వ వార్డు సీతంపేట రాధాకృష్ణా మందిరం వద్ద వార్డు జనసేన పార్టీ అధ్యక్షుడు కూరెళ్ల సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఉత్తర నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి వెల్లంకి భరత్, జనసేన పార్టీ ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, మాజీ కార్పొరేటర్ నారా నాగేశ్వరరావుల చేతుల మీదుగా కేక్ కట్ చేశారు. పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి వివిధ వైద్య పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో భీమవరపు శ్రీను, నమ్మి రవికుమార్, నరాల బాలకృష్ణ, ఉమాశంకర్, ఇసరపు వాసు, ఇసరపు కుమార్, కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళా అభిమానులు పాల్గొన్నారు.

పేదలకు పథకాల అమలు తీరుపై విద్యార్థుల పరిశీలన



విద్యార్థులతో ఏయూటీడీ సిబ్బంది

అక్కయ్యపాలెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : నగరంలో పేదలకు జీవీఎంసీ అందిస్తున్న పథకాల అమలు తీరు తెలుసుకొనేందుకు 23 మంది రోడా మిస్త్రీ సోషల్ వర్క్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీరాములు ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని జీవీఎంసీ నిరాశ్రయుల వసతి గృహాలను సందర్శించారు. గత 14 ఏళ్ళుగా జీవీఎంసీతో కలిసి చేస్తున్న మురికివాడల అభివృద్ధి, చెత్త సేకరణ కార్మికులు, వీధి వ్యాపారుల గుర్తింపు, నిరాశ్రయులకు షెల్టర్ల ద్వారా అందిస్తున్న సేవలన్నీ కూడా ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఏయూటీడీ సిబ్బంది కె.జ్యోతిర్మయి, లీలా, శ్రీను, ప్రశాంత్ పాల్గొన్నారు.



వాసవీ మాత విగ్రహాన్ని ఊరేగిస్తున్న ఆర్య వైశ్యులు, ఆత్మార్పణ అలంకరణలో అమ్మవారు

ఘనంగా కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం

మహారాణిపేట/జగదాంబ కూడలి, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్‌లోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు, ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో అమ్మవారికి 108 సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అలాగే స్వర్ణ పుష్పార్చన జరిపారు. అనంతరం 102 మంది ఆర్యవైశ్య దంపతులు జగన్నాథస్వామి ఆలయం నుంచి కన్యకా పరమేశ్వరి ఆలయం వరకు ఏకరూప దుస్తులతో ఊరేగింపు చేపట్టారు. మధ్యాహ్నం నారాయణ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో కంకటాల మల్లిక్, పైడా కృష్ణప్రసాద్ ఆరిశెట్టి దినకర్, తదితరులు పాల్గొన్నారు.

పూజలకు అనుమతి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జగదాంబ కూడలి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో సంప్రదాయం ప్రకారం పూజలు చేసుకోవడానికి భక్తులకు అనుమతిచ్చారు. భక్తులు నేరుగా అమ్మవారికి పాల, జలాభిషేకాలు చేయడంతో పాటు పసుపు, కుంకుమ, పూలు, మొక్కుబడి చీరలను అమ్మవారి వద్ద ఉంచి పూజ చేయడం ఆనవాయితీ. అందుకు విరుద్ధంగా అధికారులు మార్గశిర మాసోత్సవాలు, గురు, శుక్రవారం, ప్రత్యేక రోజుల్లో భక్తుల తాకిడిని బట్టి మూలవిరాట్ వద్ద తాళ్లను కట్టి భక్తులను పూజలకు దూరం చేశారు. దీంతో పలువురు తీవ్ర మనస్తాపానికి లోనయ్యారు. భక్తులు స్వయంగా అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకునే అవకాశం కోల్పోయారు. దీనిపై 'పూజల్లో ఆలయ సిబ్బంది జోక్యం' అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో ఈవో శోభారాణి, ఆలయ సూపరింటెండెంట్లు స్పందించి చర్యలకు దిగారు. గురు, శుక్రవారం భక్తులు నేరుగా గర్భగుడిలో అమ్మవారికి పూజలు చేసుకునే అవకాశం కల్పించారు.దీంతో పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మూలకు చేరిన ఆర్వో ప్లాంట్లు

అక్కయ్యపాలెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26, 42 వార్డుల్లోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు మూలకు చేరాయి. గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకం కింద ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్లతో తాగునీటి సమస్య ఉండదనుకున్నా, కొద్ది రోజులకే మరమ్మతులు కావడంతో ఎక్కడివక్కడే వదిలేశారు. 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ పాఠశాలలో మరమ్మతులకు గురైన ప్లాంట్ ఇంతవరకు బాగుపడలేదు. వీటికోసం వెచ్చించిన లక్షలాది రూపాయలు వృథా అయ్యాయి. 42వ వార్డు రైల్వే న్యూకాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని కృష్ణవేణి సొంత డబ్బు వెచ్చించి బాగుచేయించినా నిరుపయోగంగా మిగిలింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్వో ప్లాంట్లు బాగు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎండాడ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు.పీఎంపాలెం పోలీసుల వివరాలు ప్రకారం..కొమ్మాది వైఎస్సార్ కాలనీలో నివాసం ఉంటున్న దిమిలి సూరిబాబు (43) కార్పెంటర్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిస కావడంతో ఈనెల 28న ఇంటి మెట్లు ఎక్కుతుండగా జారి పడడంతో తలకు గాయమైంది. కుటుంబ సభ్యులు వెంటనే గాయత్రి ఆసుపత్రికి తర లించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్‌కి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు పరమేశ్వరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేశారు.

'ఉక్కుపై కేంద్ర మంత్రి ప్రకటనలో స్పష్టత ఏదీ?'

జగదాంబ కూడలి,జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణపై కేంద్ర మంత్రి కుమారస్వామి ఎలాంటి స్పష్టత ఇచ్చారని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ ఎస్‌వీ కుమార్ ప్రశ్నించారు. శుక్రవారం సంఘ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉక్కుపై కేంద్ర మంత్రి కుమారస్వామి, సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో కార్మికులు ఆందోళనకు గురవుతున్నారని విమర్శించారు. ఉక్కు సందర్శనకు వచ్చిన కేంద్ర మంత్రి కుమారస్వామి కర్మాగారాన్ని పరిరక్షిస్తామని అన్నారని, అంతకుమించి ఎటువంటి స్పష్టత ఇవ్వకపోవడం వెనుక మర్మమేటని ప్రశ్నించారు.ప్యాకేజీ వల్ల ఉక్కుకు ఒరిగేది శూన్యమని విమర్శించారు. కొన్ని విభాగాలను ప్రైవేట్‌పరం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని, ఇప్పటికే అగ్నిమాక కేంద్రం నిర్వహణ ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారన్నారు. ఇదే తరహాలో మరి కొన్ని విభాగాలను ఇవ్వనున్నట్టు ఆరోపించారు.

7న ఎస్సీ వర్గీకరణపై 'లక్ష డప్పులు, వేల గొంతులు'


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

సీతంపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఈనెల 7న లక్ష డప్పులు, వేల గొంతులు పేరుతో మాదిగల భారీ సాంస్కృతిక ప్రదర్శన ర్యాలీని, సభ నిర్వహించనున్నట్టు ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు పేర్కొన్నారు. ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. గత ఏడాది ఆగస్టులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు రాష్ట్రాలు వర్గీకరణ చేయాల్సి ఉండగా కావాలనే జాప్యం చేస్తున్నాయని ఆరోపించారు. 30 ఏళ్లుగా చేస్తున్న సుదీర్ఘ పోరాటం చివరి దశకు వచ్చిందని, లక్ష డప్పులు, వేల గొంతుల కార్యక్రమం ద్వారా వర్గీకరణ జరిగి తీరుతుందన్నారు. అనంతరం నాయకులు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజూరి దీపక్, కింతాడ రాజశేఖర్, అత్తోట రవికుమార్, ఉప్పలపాటి దానమయ్య, తొత్రం మూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉక్కు రిలే దీక్షల కార్యాచరణ

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో రోజువారీగా పాల్గొనే యూనియన్‌ల జాబితాను ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు శుక్రవారం ప్రకటించారు. ఇందులో భాగంగా ఫిబ్రవరి 1, 5, 8, 14, 19, 22, 27 తేదీల్లో ఇంటక్, 3, 6, 10, 15, 20, 24, 28 తేదీల్లో సీఐటీయూ, 4, 7, 11, 17, 21, 26 తేదీల్లో ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు దీక్షల్లో పాల్గొంటారు. అలాగే రెండో తేదీన కాంట్రాక్టు కార్మికులు (ఇంటక్), 9న కాంట్రాక్టు కార్మికులు (సీఐటీయూ), 12న ఓబీసీ అసోసియేషన్, 13న 29న యూజ్, డీఐటీయూ, జేఏంఎస్, వీఎస్ఎంఎస్, వీఎస్ఈయూ, వీఎస్‌పీయూఈ, 18న డీఎస్ఈయూ, టీఎన్‌టీయూసీ, 23న కాంట్రాక్టు కార్మికులు (టీఎన్‌టీయూసీ), 25న సీఎఫ్‌టీయూఐ యూనియన్ల నాయకులు, కార్మికులు వారీగా దీక్షల్లో కూర్చుంటారు.

విద్యుత్ అంతరాయంపై ప్రజల ఆవేదన

మల్కాపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం సబ్ స్టేషన్ అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వకుండా శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరున్నర గంటల వరకు వివిధ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేయడంపై ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. అచ్చినాయుడు తోటలో నిర్మించిన టిడ్కో ఇళ్లకు 33కేవీ విద్యుత్ కనెక్షన్ ఇచ్చే నిమిత్తం సుమారు 9 గంటల పాటు విద్యుత్ సరఫరాను నిలిపివేయడం దారుణమని వాపోయారు. టిడ్కో ఇళ్లకు విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయడం మంచిదే అయినప్పటికీ ముందుగా ఎటువంటి ప్రకటన చేయకపోవడం పట్ల పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

ఉత్సాహంగా ఉత్సవ్

... 3వ పేజీ తరువాయి

లభించింది.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

ప్రధాన వేదికపై శుక్రవారం సాయంత్రం ప్రదర్శించిన బస్తార్ బంద్, తోడా, గోండు ట్రైబ్స్ నృత్యం, తప్పెటగుళ్ల, కొమ్ముకోయ, సవర నృత్యం, జాతపు నృత్యం, చెక్క భజన, జముకుపేట, మణిపూర్ సంప్రదాయ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ఆన్‌లైన్‌లో ఇంటర్ హాల్ టికెట్లు

... 3వ పేజీ తరువాయి

బకాయిలున్న విద్యార్థులకు హాల్‌టికెట్లు నిరాకరించేవారు. పరీక్షల ముందు రోజు వరకు ఫీజుల కోసం వేధించడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యేవారు. తాజాగా ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలకు హాజరయ్యే అవకాశం కల్పించారు.

హాల్‌టికెట్లపై ఎవరి సంతకాలు అవసరంలేదని, ప్రింట్ తీసుకువస్తే పరీక్షలకు అనుమతిస్తారని అధికారులు తెలిపారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు పుట్టిన తేదీ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పుట్టిన తేదీ లేదా మొదటి సంవత్సరం హాల్‌టికెట్ నంబరు నమోదు చేస్తే హాల్‌టికెట్ డౌన్‌లోడు చేసుకోవచ్చునని వివరించారు.

ఫ్రీ హోల్డ్‌లో అవకతవకలు

... 3వ పేజీ తరువాయి

పశువులు/గొర్రెలు/మేకల మేత కోసం ఎంపిక చేసిన బీడు భూములకు డీపట్టాలు ఇవ్వకూడదు. అయితే మూడు దశాబ్దాల క్రితం అప్పటి అధికారులు రామవరంలో గల ఆ 7.5 ఎకరాలకు డీపట్టాలు ఇచ్చారు. ఆ భూముల్లో రైతులు తోటలు పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం 2023 డిసెంబరులో జారీచేసిన జీవో మేరకు మేకల మేత బీడుగా ఉన్న ఆ 7.5 ఎకరాల డీపట్టా భూములకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు అయ్యాయి. దీనిపై అప్పట్లో రైతులు అభ్యంతరం వ్యక్తంచేశారు. అయితే వైసీపీ నేతల దన్ను ఉండడంతో రైతుల అభ్యంతరాలను మండల రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. రామవరం, కోలవానిపాలెం, భీమన్నదొరపాలెం గ్రామాల్లో పలు సర్వే నంబర్లలో గల డీపట్టా భూములు చాలాకాలం క్రితమే చేతులు మారాయి. రెండున్నర దశాబ్దాల క్రితం అప్పటి అధికారులు విచారణ జరిపి చేతులు మారిన భూములకు సంబంధించి డీపట్టాలు రద్దు చేశారు. అప్పట్లో రద్దు చేసిన డీపట్టా భూముల్లో కొన్నింటికి గత ఏడాది ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు ఇచ్చారనే వాదన వినిపిస్తోంది. రెండున్నర దశాబ్దాల క్రితం డీపట్టాల రద్దుకు సంబంధించి రికార్డులు ప్రస్తుతం లభ్యం కావడం లేదని తెలిసింది. అప్పట్లో భూములు కొనుగోలు చేసిన బడాబాబులు డీపట్టా భూములను తమ ఆధీనంలోనే ఉంచుకుని తోటలు పెంచారు.

ఇదిలావుండగా జిల్లాలో ఎనిమిది ఎకరాలకు సంబంధించి ఫ్రీహోల్డ్ అనుమతుల మంజూరులో నిబంధనలు పాటించలేదని జిల్లా అధికారులు గుర్తించారు. రామవరంలో 7.5 ఎకరాల మేకల బీడు, పాలవలసలో 45 సెంట్ల రాస్తాకు ఫ్రీ హోల్డ్ అనుమతులు ఇచ్చారని ప్రభుత్వానికి నివేదించారు.

రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిట

... 3వ పేజీ తరువాయి

రోజుకు 20కి మించి డాక్యుమెంట్లు రిజిస్టర్ కావు. అక్కడ అన్నీ వ్యవసాయ భూములే కావడంతో పెద్దగా లావాదేవీలు జరగవు. అయితే ధరలు పెరుగుతున్న నేపథ్యంలో భారీగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. గురువారం 58, శుక్రవారం 98 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేసినట్టు సబ్ రిజిస్ట్రార్ ఆనంద్‌కుమార్ తెలిపారు.గాజువాకలో గురు వారం 53, శుక్రవారం 98 డాక్యుమెంట్లు రిజిస్టర్ అయినట్టు సబ్ రిజిస్ట్రార్ తారకేశ్ వివరించారు. ఇలా అన్ని కార్యాలయాల్లో రెట్టింపు కంటే ఎక్కువ జరిగాయి. జిల్లా వ్యాప్తంగా చూసుకుంటే గురువారం 663, శుక్రవారం 871 డాక్యుమెంట్లు రిజిస్టర్ అయినట్టు జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర తెలిపారు. అయితే ఎక్కువ డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయడం వల్ల సర్వర్ ఇబ్బంది పెట్టింది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి ప్రక్రియ ఆగిపోయింది. అధికారులు, సిబ్బంది రాత్రి పది గంటల వరకు ఉండి వచ్చిన డాక్యుమెంట్లన్నింటినీ రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు.

సిబ్బంది తగ్గాలట, ఉత్పత్తి పెరగాలట!

... 3వ పేజీ తరువాయి

కార్మికులను నిలిపివేశారు. ఇంకో వేయి మందిని ఆపేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ కార్మికులు అన్ని విభాగాల్లో కీలకమైన పనులు చేస్తారు.

సింటర్ ప్లాంటు, బ్లాస్ట్‌ఫర్నేస్‌లు, కోక్ ఓవెన్ల వంటి విభాగాల్లో 30 శాతం తగ్గించేస్తే అక్కడ పనులు చేసే వారు ఉండరు. ఆయా పనులను ఎగ్జిక్యూటివ్‌లు కానీ, నాన్ ఎగ్జిక్యూటివ్‌లు కానీ చేయరు. చేయలేరు. దానివల్ల అక్కడ ఉత్పత్తి ప్రక్రియ మందగిస్తుంది. ఆశించిన లక్ష్యాలు సాధించడం కుదరదు. అన్నిచోట్ల ఒకేలా వ్యవహరించడం తగదని ఆయా విభాగాల అధికారులు చెబుతున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదు. ఇటీవల సింటర్ ప్లాంటులో క్లీనింగ్ సిబ్బందిని తీసేశారని, దానివల్ల కన్వేయర్ల వద్ద ఇబ్బందులు వస్తున్నాయని, కాంట్రాక్ట్ సిబ్బందిని నియమించాలని ఏడు నెలల క్రితమే ఆ విభాగం యాజమాన్యానికి లేఖలు రాసినా పట్టించుకోలేదు. దానికి భారీ మూల్యం చెల్లించుకోవలసి వచ్చింది.

ఇకపై జరిగే ప్రమాదాలకు కూడా ఇవే ప్రధాన కారణాలుగా నిలుస్తాయని అధికార వర్గాలు చెబుతున్నాయి.

పేదలకు ఉపశమనం

... 3వ పేజీ తరువాయి

వరకు భూమి విలువ 100 శాతం, 50 శాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని ప్రభుత్వం పేర్కొంది.

ఇవీ మార్గదర్శకాలు

భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం పలు మార్గదర్శకాలు జారీచేసింది. ఆధార్ కార్డు కలిగి ఉండాలి. గ్రామీణ ప్రాంతంలో కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.2 లక్షలు, పట్టణాల్లో రూ.1.44 లక్షలు మించకూడదు. సొంతంగా కారుంటే క్రమబద్ధీకరణకు అర్హత ఉండదు. అయితే జీవనోపాధికి ట్యాక్సీ, వ్యవసాయం కోసం ట్రాక్టర్ సొంతంగా సమకూర్చుకున్నా అనుమతిస్తారు. మెట్ట, మాగాణి కలిసి ఐదెకరాలకు మించకూడదు.

అధిక ఆదాయం ఉన్న వారికి కూడా 150 గజాల వరకు ఉచితంగానే క్రమబద్ధీకరిస్తారు. 151 నుంచి 300 గజాల వరకు క్రమబద్ధీకరణ కోరితే భూమి విలువలో 15 శాతం ఫీజు, పూర్తిగా రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. 301 నుంచి 450 గజాల వరకు భూమి విలువలో 200 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజులు అక్కడ ఉన్న ధరల మేరకు చెల్లించాల్సి ఉంటుంది.

25 వేల మందికి ఉపశమనం

నగరంతోపాటు పరిసరాల ప్రాంతాల్లో కొండలు, కొండవాలు ప్రాంతాలు, ప్రభుత్వ ఖాళీ స్థలాలను ఆక్రమించుకుని వేలాది మంది ఇళ్లు నిర్మించుకున్నారు. గత టీడీపీ హయాంలో ఇచ్చిన జీవో 296 మేరకు నగరంలో 83,891 మంది క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేయగా 46,526 మందిని అర్హులుగా గుర్తించి పట్టాలిచ్చారు. మరో 544 మందికి పట్టాలు జారీచేసే ప్రక్రియ పెండింగ్‌లో ఉండిపోయింది. 36,821 దరఖాస్తులను తిరస్కరించారు. ఇంకా 388 జీవో మేరకు 53,347 మంది దరఖాస్తు చేయగా 8,687 మంది అర్హులని తేల్చారు.వీరిలో 7,030 మంది క్రమబద్ధీకరణకు డబ్బు చెల్లించడంతో పట్టాలిచ్చారు. అయితే 296, 388 జీవో మేరకు క్రమబద్ధీకరణ చేసిన రెండేళ్లలో కన్వేయన్స్ డీడ్ ఇవ్వాలి. కానీ 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత దీనిని పూర్తిగా పక్కనపెట్టేసింది. తాజాగా వారందరికీ కన్వేయన్స్ డీడ్స్ ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పాటు గతంలో క్రమబద్ధీకరణ జీవో మేరకు దరఖాస్తు చేయని వారంతా మరోసారి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది.

మత్తు పదార్థాలతో భవితను చిత్తు చేసుకోవద్దు

పెందుర్తి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలతో యువత బంగారు భవిష్యత్తును చిత్తు చేసుకోవద్దని సీఐ కేవీ సతీశ్‌కుమార్ కోరారు. మండలంలోని రాజయ్యపేటలోని డిఫెన్స్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐ మాట్లాడుతూ గంజాయి, మద్యానికి బానిస కావొద్దని, విద్యార్థి దశ నుంచే ఉన్నతమైన లక్ష్యాన్ని ఏర్పరుచుకుని సమాజంలో మంచి పౌరులుగా ఎదగాలన్నారు. డ్రగ్స్ మహమ్మారిని సమాజం నుంచి పారద్రోలాలన్నారు. గంజాయి వంటి వాటికి సంబంధించిన సమాచారాన్ని ఈగిల్ టోల్‌ఫ్రీ నంబర్-1972కు ఫోన్ చేసి అందించాలన్నారు.

సినిమా గైడ్

● **మదగజరాజా :** జగదాంబ, సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),

● **మహిష :** రమాదేవి

● **సంక్రాంతికి వస్తున్నాం :** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)

● **డాకు మహారాజ్ :** శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)

● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం),కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 30, టమాటా 12, వంకాయలు (తెలుపు)20, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 46, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 46, బీరకాయలు 50, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 12, క్యాబేజి 14, క్యారెట్ 28 దొండ కాయలు 36, బంగాళ దుంపలు 22, అరటి కాయ (పె)7, మునక్కాడలు (కిలో) 110, అల్లం (పాతది)44, బరబాటి 34, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 62, బద్దచిక్కుడు 24, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 44, పొటల్స్ 80, కీరదోస 32, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 436 చిలగడదుంపలు 36, కంద 56, దేముడు చిక్కుడు 24, గోరు చిక్కుడు 26, ఆగాకార దేశవాలి 100 , ఆగాకర హైబ్రిడ్ 50, కూర పెండలం 26, బ్రకోలి 70 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 60, కరివేపాకు(కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 18, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	95
లైవ్ ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210



విమాన్‌నగర్ వద్ద నిరుపయోగంగా మారిన రెండు బస్టాప్‌లు



రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన బస్ బే

4 బస్టాపులున్నా.. ప్రయోజనం సున్నా!

» ఉన్నవన్నీ కిలోమీటరు పరిధిలోనే..

» ఆగని ఆర్టీసీ బస్సులతో విమాన్‌నగర్, కాకానీనగర్ వాసులకు తప్పని ఇబ్బందులు

ఎన్.ఏడీ.జంక్షన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు పరిధి విమాన్‌నగర్ నుంచి కాకానీనగర్‌కు వెళ్లే మార్గంలో కిలోమీటరు పరిధిలో ఒకటి కాదు రెండు కాదు ఏకంగా నాలుగు బస్టాప్‌లు ఉన్నా తమకు ప్రయోజనం లేకుండా పోతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దీంతో విమాన్‌నగర్, కాకానీనగర్ వాసులు బస్సుల్లో ఎన్ఏడీ వెళ్లేందుకు బస్టాప్‌ల్లో ఎంతసేపు వేచివున్నా ఆర్టీసీ బస్సులను ఆపడం లేదని వాపోతున్నారు. ఉన్న నాలుగు బస్టాపుల్లో కనీసం ఒకచోట కూడా బస్సులను ఆపకపోవడం దారుణమని మండిపడుతున్నారు. విమాన్‌నగర్ వద్ద రెండు బస్టాప్‌లు పక్కపక్కనే ఉన్నాయి. వాటి వద్ద ఆర్టీసీ బస్సుల కోసం ఎంతసేపు నిరీక్షించినా ప్రయోజనం లేకపోవడంతో కొంత దూరం నడిచి కాకానీనగర్ బస్టాప్‌నకు చేరుకున్నా.. అక్కడా అదే పరిస్థితి నెలకొంటుందని పలువురు పేర్కొంటున్నారు. ఇక్కడ ఏకంగా రూ.లక్షలు వెచ్చించి అధునాతనమైన బస్ బేను ఏర్పాటు చేశారు.

అయినప్పటికీ అక్కడ కూడా ఆర్టీసీ బస్సులను ఆపకపోవడం ఎంతవరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. బస్సులు ఆపనిచోట లక్షల రూపాయలు ఖర్చు చేసి మరెందుకు బస్ బేను నిర్మించారని పేర్కొంటున్నారు. దీనికి ముందు పాత బస్టాప్ కూడా ఉంది. ఇలా కిలోమీటరు పరిధిలో నాలుగు బస్టాపులున్నా ఒక్కచోట కూడా బస్సులను నిలపకపోవడంతో అనేకమంది చేసేది లేక ఆటోలను ఆశ్రయిస్తున్నారు.

ముఖ్యంగా ఈ మార్గంలో వెళ్లే బస్సులు ఎన్ఏడీ ఫ్లైఓవర్‌పైకి వెళ్లేందుకు ఇబ్బందులు ఏర్పడతాయనే ఉద్దేశంతోనే వాటిని నిలుపుదల చేయడం లేదని పలువురు వాపోతున్నారు. ఆయా బస్టాపుల వద్ద బస్సులను ఆపకపోవడంపై పలుమార్లు ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి విమాన్‌నగర్, కాకానీనగర్ బస్టాపుల వద్ద ఆర్టీసీ బస్సులను సక్రమంగా ఆపేలా చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కిటకిటలాడిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

» రెండు రోజుల్లో పెందుర్తి కారాలయానికి రూ.కోటిన్నర ఆదాయం

» రాత్రి వరకు సాగిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ

పెందుర్తి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం శుక్రవారం కూడా క్రయ, విక్రయదారులతో రద్దీగా కనిపించింది. శనివారం నుంచి ప్రభుత్వం ఆస్తులు విలువ పెంచనున్న నేపథ్యంలో అమ్మకం, కొనుగోళ్లకు సంబంధించి జన తాకిడి పెరిగింది. రిజిస్ట్రేషన్లు జోరందుకోవడం.. ఒక్కసారిగా డాక్యుమెంట్లు పెరగడంతో సర్వర్లు మందగించాయి. దీంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిదానంగా సాగడంతో రాత్రి వరకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగింది. సాధరణ రోజుల్లో రోజుకు ఐదు నుంచి పది డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు అవుతుంటాయి. అయితే గురు, శుక్రవారాల్లో 130 జరిగాయి. శుక్రవారం ఒకరోజే 70 రిజిస్ట్రేషన్లను సిబ్బంది చేపట్టారు. తద్వారా రూ.కోటిన్నర ఆదాయం వచ్చినట్టు కార్యాలయ సిబ్బంది తెలిపారు. అధిక సంఖ్యలో కార్యాలయానికి విచ్చేసిన క్రయ, విక్రయదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేశామని ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ గోపీకృష్ణ తెలిపారు.



క్రయ విక్రయదారులతో కిటకిటలాడుతున్న పెందుర్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



గోపాలపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రజలు

గాజువాకలో 94 రిజిస్ట్రేషన్లు..

అక్కిరెడ్డిపాలెం: భూముల విలువ శనివారం నుంచి పెరగనుండడంతో షీలానగర్‌లోని గాజువాక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం క్రయ విక్రయదారులతో రద్దీగా మారింది. గాజువాకతో పాటు నరవ, ములగాడ, జగ్గరాజుపేట ప్రాంతాల్లో భూముల మార్కెట్ విలువ శనివారం నుంచి పెరగనున్నందున ఆయా ప్రాంతాలకు చెందిన క్రయ విక్రయాలు శుక్రవారం జోరుగా సాగాయి. సాధారణంగా రోజూ 20 నుంచి 25 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతుండగా, శుక్రవారం మాత్రం 94 రిజిస్ట్రేషన్లు జరిగినట్టు సబ్ రిజిస్ట్రార్ టి.తారకేశ్ తెలిపారు.

గోపాలపట్నంలో 50 రిజిస్ట్రేషన్లు.. రూ.65 లక్షల ఆదాయం

వేపగుంట: సింహపురి కాలనీలో ఉన్న గోపాలపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం క్రయ విక్రయదారులతో కిటకిటలాడింది. ఉదయం నుంచే అధిక సంఖ్యలో క్రయ విక్రయదారులు తరలివచ్చారు. అయితే ఇక్కడ విద్యుత్ సరఫరా లేకపోవడంతో వారంతా తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కార్యాలయానికి జనరేటర్ సదుపాయం లేకపోవడంతో యూపీఎస్‌లతో కంప్యూటర్లు కొంతసేపు పనిచేసి ఆగిపోయాయి. దీనికితోడు సర్వర్‌పై అధిక లోడ్ పడడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ నెమ్మదిగా సాగింది. మధ్యాహ్నం నుంచి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కావడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ జోరందుకుంది. రాత్రి ఎనిమిది గంటల వరకు సుమారు 50 రిజిస్ట్రేషన్లు జరగడంతో రూ.65 లక్షల వరకు ఆదాయం వచ్చినట్టు సబ్ రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ తెలిపారు. గోపాలపట్నం పరిధి వేపగుంటలో గతంలో గజం రూ.30 వేలు, వరలక్ష్మీనగర్‌లో రూ.18 వేలు, నాయుడుతోటలో రూ.24 వేలు, గోపాలపట్నంలో రూ.24 వేలు, బుచ్చిరాజుపాలెంలో రూ.35 వేలు, సింహపురి కాలనీ రూ.38 వేలు, ఎన్ఏడీ శాంతినగర్‌లో రూ.40 వేలు ఉండగా.. ఫిబ్రవరి ఒకటి నుంచి ఆయా ప్రాంతాల్లో గరిష్ఠంగా ఐదు వేల రూపాయల వరకు పెంచినట్టు అధికారులు తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై ఆర్డీవో ఫిర్యాదు

కేసు నమోదు చేసిన పెందుర్తి పోలీసులు

పెందుర్తి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం విధి నిర్వహణలో ఉన్న తన పనులకు ఆటంకం కలిగించడంతో పాటు దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై విశాఖ ఆర్డీవో శ్రీలేఖ శుక్రవారం పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశారు. సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో జనవరి 27న నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఆర్డీవో హాజరై ప్రజల నుంచి అర్జీల స్వీకరణ చేపట్టారు. ఈ క్రమంలో మురళీనగర్‌కు చెందిన డీవీ మహేశ్ అనే వ్యక్తి వేపగుంటలోని ఓ స్థల సమస్యకు సంబంధించిన పత్రాలతో వచ్చాడు. ఆయనకు కాసేపు వేచివుండాలని సిబ్బంది తెలిపారు. దీంతో సదరు వ్యక్తి తన ఎదుట అసహనం వ్యక్తం చేయడంతో పాటు విధులకు ఆటంకం కలిగించి. దురుసుగా ప్రవర్తించాడని.. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ ఆర్డీవో పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మహేశ్‌పై కేసు నమోదు చేసినట్టు సీఐ పేర్కొన్నారు.

వైభవంగా వాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం



వాసవీ కన్యకాపరమేశ్వరి సన్నిధిలో ఆర్యవైశ్యులు

కూర్మన్నపాలెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవకులు ఆర్యవైశ్యులని వడ్లపూడి ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కారుమూరి మహేశ్ అన్నారు. 88వ వార్డు పరిధి దువ్వాడలో శ్రీవాసవీమాత ఆలయంలో శుక్రవారం ఆర్యవైశ్యుల కుల దైవమైన శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని వైభవంగా నిర్వ హించారు. ముందుగా అమ్మవారికి పంచామృతాభిషేకాలు, సామూహిక కుంకుమ పూజలు జరిపారు. అనంతరం పలువురు మహిళలు అమ్మవారి భజన, భక్తిగీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ పెనుగొండలో అధికారికంగా శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరికి సీఎం చంద్రబాబు పట్టువస్త్రాలను సమర్పించారన్నారు. సంపాదించిన డబ్బులో కొంత సమాజ సేవకు ఉపయోగించేవారే ఆర్యవైశ్యులని ముఖ్యమంత్రి ప్రశంసించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆలయ కమిటీ సభ్యులు కె.జగదీశ్, కె.సత్యనారాయణ, వరహాలశెట్టి, రామకృష్ణ, శ్రీనివాసరావు, రమేశ్, సుజాత, సుభద్రాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గామాత, మరిడిమాంబ ఆలయాల వార్షికోత్సవం



పూజలందుకున్న మరిడిమాంబ

అగనంపూడి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక కొండపై వెలసిన దుర్గామాత, కొండయ్యవలస మరిడిమాంబ అమ్మవారి ఆలయాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లను ప్రత్యేక పుష్పాలు, నూతన వస్త్రాలతో శోభాయమానంగా అలంకరించి పూజలు జరిపారు. ఉదయం భక్తులంతా సారెను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవార్లకు నివేదించారు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి. జనసేన నాయకుడు విందుల వెంకటరమణ, తదితరులు అమ్మవార్లను దర్శించుకున్నారు. సాయంత్రం ఆయా ఆలయాల ప్రాంగణంలో తీర్థాన్ని జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బల్ల పైడిరాజు, విందుల చిరురాజు, బి.శ్రీను, బి.అప్పారావు, పి.కొండలరావు, బి.సత్యనారాయణ, వి.వరహాలు, ఎం.రామచంద్రరరావు, వసంతరావు, తదితరులు పాల్గొన్నారు.

దుర్గమాంబ, కుంచమాంబ పరస

మల్కాపురం: శ్రీహరిపురంలో దుర్గమాంబ, కుంచమాంబ అమ్మవార్ల పరసను ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. యంగ్ బాయ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.





నేటి నుంచి వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మెడ్‌టెక్ జోన్‌లో ఫిబ్రవరి 1, 2 తేదీల్లో వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించనున్నారు. ఆర్థోటిక్స్, ప్రోస్తెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఓపీఏఐ) ఆధ్వర్యంలో వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూబీఎఫ్ఐ) సహకారంతో ఈ పోటీలు జరగనున్నాయి. అలాగే ఓపీఏఐ 28వ సమావేశాన్ని నిర్వహించనున్నారు.

ఉక్కు దీక్షా శిబిరం కొనసాగింపుపై తర్జనభర్జన?

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం కూర్మన్నపాలెం ఆర్చి వద్ద ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని కొనసాగించాలా, వద్దా.. అనే అంశంపై నాయకులు తర్జనభర్జన పడుతున్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాదని, ఉక్కు కర్మాగారానికి కేంద్రం పూర్తిగా సహకరిస్తుందని, ప్లాంట్ అతి తక్కువ కాలంలోనే అన్ని రంగాల్లో ప్రగతి సాధించేందుకు సహకారాన్ని అందిస్తామని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, ఉక్కుశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మలు గురువారం స్పష్టం చేశారు. అదేవిధంగా ఇప్పటికే ప్లాంటుకు కేంద్రం భారీ ప్యాకేజీని ప్రకటించింది. ఈ నేపథ్యంలో దీక్షా శిబిరాన్ని ఎత్తివేయాలన్న డిమాండ్ ఉన్నప్పటికీ కొంతమంది మాత్రం కొనసాగించాలని పట్టుబడుతున్నట్టు తెలిసింది. అయితే దీక్షా శిబిరం కొనసాగింపు వల్ల ఎటువంటి ప్రయోజనం లేదని, ఉక్కు కర్మాగారానికి కేంద్రం సహకరిస్తున్నప్పుడు దీక్షల కొనసాగింపు ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో దీక్షా శిబిరాన్ని కొనసాగిస్తారా.. లేక ఎతివేస్తారా అనే అంశంపై కార్మికులు చర్చించుకోవడం పరిపాటిగా మారింది.

వేపగుంటలో మల్టీప్లెక్స్ థియేటర్లకు అనుమతి

విశాఖపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి మండలం వేపగుంట సర్వే నంబర్-76/3లో 4,465 చ.మీ. స్థలంలో ఉన్న సినిమా థియేటర్‌ను మల్టీపెక్స్ కమ్ షాపింగ్ మాల్ లేదా కమర్షియల్ కాంప్లెక్స్‌గా అభివృద్ధి చేయడానికి అనుమతి ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇది విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబుకు చెందిన స్థలం. అర్బన్ ల్యాండ్ సీలింగ్ పరిధిలో ఉండటంతో ఆయన అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అవసరమైతే దీనిని విక్రయించుకునే హక్కును కూడా కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.

నిర్మలాదేవికి కొమ్మా శివశంకరరెడ్డి స్మారక పురస్కారం



పెదగంట్యాడ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత్రి, అనువాదకురాలు డాక్టర్ చిట్టెల్ల నిర్మలాదేవి కొమ్మాశివశంకరరెడ్డి స్మారక పురస్కారానికి ఎంపికయ్యారు. ఫిబ్రవరి 15న కడపలో జరగనున్న కొమ్మా శివశంకరరెడ్డి స్మారక అనువాద పురస్కార సభలో ఆమె ఈ పురస్కారాన్ని అందకోనున్నారు. ప్రముఖ రచయిత రాంభట్ల నృసింహశర్మ రచించిన గాహే తవజయ గాథ పుస్తకాన్ని హిందీలోకి అనువదించినందుకుగాను నిర్మలాదేవికి ఈ పురస్కారం లభించింది.

నరసింహనాయుడుకు తెలుగు వెలుగు నంది అవార్డు



అగనంపూడి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడకకు చెందిన విందుల నరసింహనాయుడు తెలుగు వెలుగు నంది అవార్డుకు ఎంపికయ్యారు. తెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విజయవాడలో ఫిబ్రవరి రెండున నిర్వహించనున్న కార్యక్రమంలో ఈ అవార్డును ఆయనకు అందించనున్నారు. కళారంగంలో విశిష్ట సేవలను అందిస్తున్న నరసింహనాయుడు ఈ అవార్డుకు ఎంపికవ్వడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పల్లా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు, తదితరులు

గాజువాకలో సీతారామ ఉమారామలింగేశ్వరస్వామి పరస రేపు

వైభవంగా నిర్వహిస్తాం: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

గాజువాక, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో అతి పెద్దదైన సీతారామ ఉమా రామలింగేశ్వరస్వామి పరసను ఫిబ్రవరి రెండో తేదీన ఎంతో వైభవంగా నిర్వహిస్తామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఇందుకు సంబంధించిన పోస్టరును శుక్రవారం గాజువాకలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా మాదిరిగానే ఆదివారం జరగనున్న పరసకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేయవలసిందిగా కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య ఉత్సవ కమిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యం నుంచి కాపాడాలని 'పల్లా'కు వినతి

అక్కిరెడ్డిపాలెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): విశాఖ పోర్టు అనుమతితో అక్కిరెడ్డిపాలెం పంచవటి కాలనీ సమీపంలో సాన్వీరా కంపెనీ నిర్మిస్తున్న గొడౌన్ల వల్ల ఏర్పడే కాలుష్యం నుంచి ప్రజలను కాపాడాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కాలనీ అసోసియేషన్ నాయకులు వేడుకున్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయనను గాజువాకలోని పార్టీ కార్యాలయంలో కలిసి గొడౌన్ల నిర్మాణం వల్ల ఎదురయ్యే ఇబ్బందులను వారు వివరించారు. సాన్వీరా కంపెనీ గ్రీన్ పెట్రో కోక్ నిల్వ చేసేందుకు గాను అక్కిరెడ్డిపాలెం, పంచవటి కాలనీ, మింది కాలనీలను ఆనుకుని ఉన్న పోర్టు స్థలంలో గొడౌన్ల నిర్మాణ పనులను ప్రారంభించిందని, ఇక్కడ గ్రీన్ పెట్రో కోక్ నిల్వ చేయడం వల్ల పరిసర కాలనీల ప్రజలు జల, వాయు కాలుష్య సమస్యల బారినపడతారని పేర్కొన్నారు. అందువల్ల ఈ గొడౌన్ల నిర్మాణాలను నిలిపివేసేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. పల్లాను కలిసిన వారిలో కాలనీ నాయకులు పి.చిన్నారావు, వై.రామ్మోహన్, జి.నరసింహమూర్తి, మురళీ, తదితరులు తెలిపారు.

రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఎఫెక్ట్





కూర్మన్నపాలెం కూడలిలో ఎన్టీఆర్ విగ్రహం, పాత గాజువాకలో రాజీవ్‌గాంధీ విగ్రహం

గాజువాక, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. స్వాతంత్ర సమరయోధుల విగ్రహాలకు మినహా పారిశ్రామిక ప్రాంతంలో పలుచోట్ల ఉన్న రాజకీయ నాయకుల విగ్రహాలకు అధికారులు ముసుగులు వేశారు. ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేసేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు ఆ దిశగా చర్యలు చేపడుతున్నారు.

బాలకృష్ణకు పద్మభూషణ్ రావడం పట్ల సంబరాలు

పెందుర్తి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు, హిందూపూర్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డు రావడంతో స్థానిక జై బాలయ్య టీమ్ అధ్యక్షుడు వేగి వాసు ఆధ్వర్యంలో శుక్రవారం బాలకృష్ణ అభిమానులు సంబరాలు నిర్వహించారు. ఇక్కడి టీడీపీ కార్యాలయంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు హాజరై కేకు కట్ చేసి వాసు, బాలయ్య అభిమానులకు తినిపించారు. అనంతరం పీలా మాట్లాడుతూ నటుడిగా, ప్రజా సేవకుడిగా బాలకృష్ణ అన్ని రంగాల్లో తనదైన శైలిలో ముద్ర వేస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ 96వ వార్డు అధ్యక్షుడు వేగి పరమేశ్వరరావు, బాలకృష్ణ అభిమానులు షేక్ సాహరాల్, మళ్ల శ్రీనివాస్, జి.రమణ, కె.మహేశ్, జె.శ్రీను, గురప్ప రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై క్యూఆర్ కోడ్

» మెరుగైన సేవల దిశగా చర్యలు



సింహాచలం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): భక్తులకు మెరుగైన సేవలందించాలనే ధ్యేయం తో దేవదాయశాఖ అధికారులు శుక్రవారం సింహగిరిపై క్యూ ఆర్ కోడ్‌ను ఏర్పాటు చేశారు. ఆ శాఖ కమిషనర్ కోడూరి రామచంద్రమోహన్ భక్తుల నుంచి ఫీడ్‌బ్యాక్‌ను తీసుకోవడం కోసం అన్ని దేవాలయాల్లో దీనిని ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా ప్రధాన రాజగోపురం, కేశఖండనశాల, అన్నప్రసాద భవనం, ప్రసాదాల విక్రయకేంద్రాలు, విచారణ కేంద్రం, తదితర 25 ప్రాంతాల్లో కోడ్‌ను ప్రదర్శించారు. భక్తులు సమస్యలు, సౌకర్యాలు, సిబ్బంది వ్యవహార శైలి, తదితర అంశాలపై క్యూఆర్ కోడ్‌ను మొబైల్‌లో స్కాన్‌చేసి అభిప్రాయాలను అప్‌లోడ్ చేస్తే ఆలయ సిబ్బంది, కమిషనర్ కార్యాలయానికి చేరుతాయి.

కుంభమేళాకు ప్రత్యేక రైలు

విశాఖపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల డిమాండ్ మేరకు విశాఖ, గోరఖ్‌పూర్ మధ్య ఒక ట్రిప్పు ప్రత్యేక రైలు ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు విశాఖ-గోరఖ్‌పూర్ 08588 ప్రత్యేక రైలు ఈనెల 4న రాత్రి 10.20కు విశాఖలో బయలుదేరి గురువారం రాత్రి 7.30కు గోరఖ్‌పూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో (08587)ఈనెల 7న సాయంత్రం 5.45 గంటలకు గోరఖ్‌పూర్‌లో బయలుదేరి ఆదివారం మధ్యాహ్నం 3.55 గంటలకు విశాఖ చేరుతుంది.

అలెప్పీ-ధనబాద్ మళ్లింపు

సదరన్ రైల్వేలో పరిధిలో నిర్మాణ పనులు చేపడుతున్న నేపథ్యంలో అలెప్పీ దనబాద్ బొకారో ఎక్స్‌ప్రెస్ ఈనెల 2, 4, 6, 18, 25 తేదీల్లో కొయంబత్తూరు స్టేషన్‌కు చేరకుండా పొదనూర్ మీదుగా నడుస్తుందని తెలిపారు.

ఒడిశాకు అప్పన్న ప్రచార రథం



సింహాచలం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి క్షేత్ర మహాత్మ్యం, హైందవ ధర్మ విస్తృత ప్రచారానికి దేవస్థానానికి చెందిన ప్రచార రథం ఈనెల 2న సింహాచలంలో బయలుదేరి ఒడిశాలోని బరంపురం జిల్లా పట్టుపురం వెళ్లనుంది. ఈ పర్యటనలో ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్ నాయకోదానుడి సారథ్యంలో పట్టుపురంలో మూడో తేదీ ఉదయం 9 నుంచి నారసింహ హవనం, సాయంత్రం 5 గంటలకు స్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. 4న పద్మనాభపురం, 5న విష్ణుచక్ర పురం, 5న హండీఫర్, 6న చికిడీలో స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించిన అనంతరం రథం తిరిగి బయలుదేరుతుంది.

అరకులో ఉత్సవ్ సందడి



ఉత్సవ్ సందర్భంగా అరకు వీధుల్లో కార్నివాల్ నిర్వహిస్తున్న దృశ్యం

అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో శుక్రవారం 'చలి ఉత్సవ్-25' ఘనంగా ప్రారంభమైంది. కలెక్టర్ ఎ.ఎస్.దినేశ్‌కుమార్ తుడుము కొట్టి ఉత్సవ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. మూడు రోజులపాటు నిర్వహించే ఉత్సవ్‌ను స్థానికులు, పర్యాటకులు ఆస్వాదించేలా ఏర్పాట్లు చేశారు. తొలిరోజు ఉదయం యండపల్లివలస నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకూ 5కే రన్, గిరిజన మ్యూజియం ఆవరణలో ముగ్గులు, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన కార్నివాల్‌లో భారీ సంఖ్యలో జనం పాల్గొన్నారు. కాగా రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సంగీత దర్శకురాలు ఎంఎం శ్రీలేఖ, సినీ నేపథ్య గాయకుడు శ్రీకృష్ణ తమ పాటలతో ప్రేక్షకులకు ఉర్రూతలూగించారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



కార్నివాల్‌లో నృత్యం చేస్తున్న పాడేరు కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్, జేసీ, తదితరులు



ఎయిర్ బెలూన్ వద్ద చిందులేస్తున్న యువత



పద్మావతి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ఫ్లవర్ షో



వివిధ రకాల పంటతో గిరిజన మహిళల ప్రదర్శన



మ్యూజికల్ నైట్‌లో పాటలు పాడుతున్న సంగీత దర్శకురాలు ఎంఎం శ్రీలేఖ, గాయకుడు శ్రీకృష్ణ



అలరించిన చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

కీళ్ల సమస్యలకు రీ జనరేటివ్ మెడిసిన్‌తో చెక్

» మొదటి, రెండు దశల్లో గుర్తించడం కీలకం

» ప్రముఖ ఆర్థో వైద్య నిపుణులు డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ



డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ

విశాఖపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కీళ్ల సమస్యలతో బాధపడే వారికి రీ జనరేటివ్ మెడిసిన్ చక్కని పరిష్కారమని ప్రముఖ ఆర్థో వైద్య నిపుణులు, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ పేర్కొన్నారు. వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఏపీ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సదస్సులో పాల్గొనేందుకు విచ్చేసిన ఆయన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

కీళ్ల సంబంధిత, ముఖ్యంగా జాయింట్ సమస్యలతో బాధపడుతున్న వారికి రీ జనరేటివ్ మెడిసిన్ మంచి ఉపశమనాన్ని కలిగిస్తుంది. జాయింట్స్ అరిగిపోకుండా మెత్తగా ఉండే కార్టిలేజ్ (మృదులాస్థి) కాపాడుతుంటుంది.కొన్ని పనులు, ఆహారపు అలవాట్లు, జీవన విధానం వల్ల కార్టిలేజ్ అరిగిపోతోంది. దీనివల్ల జాయింట్స్‌లో తీవ్రమైన నొప్పి వస్తుంది. ఈ సమస్యలకు రీ జనరేటివ్ మెడిసిన్‌తో కార్టిలేజ్ పెరిగేలా చేస్తారు. ఇందులో మొదటిది ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా థెరపీ. ఇది స్టెమ్‌సెల్స్‌లా పనిచేస్తుంది. ఈ థెరపీలో కార్టిలేజ్ మళ్లీ వృద్ధి చెందేలా చేస్తాం. కొన్ని రకాల మందులు ప్రాథమిక దశలో కార్టిలేజ్ అరిగిపోకుండా ఉపకరిస్తాయి. సైనోవియల్ ఫ్లూయిడ్ అనే ఇంజెక్షన్‌ను ఇవ్వడం ద్వారా కార్టిలేజ్‌ను యాక్టివేట్ చేయవచ్చు. ఇది లూబ్రికేషన్‌గా పనిచేస్తుంది. ఈ ఫ్లూయిడ్ ఇచ్చిన తరువాత కార్టిలేజ్ డ్యామేజ్ కావడం వల్ల ఎముకలు జాయింట్స్‌లో వచ్చే శబ్దాలు తగ్గు ముఖం పడతాయి.

వేగంగా గుర్తించడం కీలకం..

ప్రస్తుతం ఎముకల సమస్యలను వేగంగా గుర్తించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జాయింట్స్‌లో ఇబ్బందులు వస్తే చాలామంది శస్త్ర చికిత్సలకు సిద్ధమవుతున్నారు. రీ ప్లేస్‌మెంట్స్ కూడా 15 ఏళ్ల వరకు పనిచేస్తాయి. ఆ తరువాత మళ్లీ చేయించుకోవాలి. మొదటి, రెండు దశల్లో జాయింట్ సమస్యలను గుర్తించి రీ జనరేటివ్ మెడిసిన్ వినియోగిస్తే ప్రయోజనం ఉంటుంది. ఎక్స్‌రే, ఎంఆర్ఐ, రేంజ్ మూవ్ మెంట్స్‌ను బట్టి సమస్య లను గుర్తించడం సాధ్య పడుతుంది. మొదటి స్టేజ్‌లో ఉన్న వారికి సైనో వి యల్ ఫ్లూయిడ్ ఇవ్వడం, రెండో స్టేజ్‌లో పీఆర్‌పీ ఇంజెక్షన్లతో ఫలితం ఉంటుంది. మూడు, నాలుగు స్టేజ్‌లకు వెళితే ఆప రేషన్ చేయించాల్సి ఉంటుంది.

భిన్న అంశాలపై చర్చ

సదస్సులో భిన్న అంశాలపై వైద్యులు చర్చించారు. కోయంబత్తూరులోని గంగా ఆస్పత్రి చైర్మన్, డాక్టర్ ఎస్ రాజశేఖరన్‌తో కూడిన వైద్యుల బృందం ఎముకలు విరిగిపోయి దుమ్ము బయటకు వస్తే మెరుగైన చికిత్స పై లైవ్ సర్జరీలు నిర్వహించి వైద్యులు, వైద్య విద్యార్థు లకు అవగాహన కల్పించారు. సదస్సులో ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ కె.శివానంద, డాక్టర్ లోకనాథం, డాక్టర్ వర్మ, డాక్టర్ లీలాప్రసాద్, డాక్టర్ నాయుడు, డాక్టర్ భవానీప్రసాద్, డాక్టర్ అశోక్‌కుమార్, డాక్టర్ ఉదయ్‌కుమార్, డాక్టర్ అచ్యుత్, వైద్య విద్యార్థినులు పాల్గొన్నారు.

ఇన్‌ఫెక్షన్ ముప్పు తప్పించేలా చూడాలి



డాక్టర్ హరి వెంకటరమణి

ప్రమాదాల్లో గాయపడిన ఎంతోమందికి చర్మం పూర్తిగా ఊడిపోయి ఎముకలు బయటకు వచ్చేస్తాయి. ఇటువంటి కేసుల్లో ఇన్‌ఫెక్షన్ ముప్పు అధికం. ఈ ముప్పును తప్పించేలా జాగ్రత్తలు తీసు కోవ్వాని కోయంబత్తూరులోని గంగా ఆస్పత్రికి చెందిన వైద్య నిపుణుడు డాక్టర్ హరి వెంకటరమణి పేర్కొన్నారు. ప్రమాదాలకు సంబంధించిన కేసులను పరిశీలించినప్పుడు ఎముకలు విరిగిపోయి చర్మంతో సహా బయటకు వస్తుంటాయన్నారు. ఈ కేసుల్లో ఇన్‌ఫెక్షన్ ముప్పు అధిక మన్నారు. ఆర్థో, ప్లాస్టిక్ సర్జన్ల అప్రోచ్ అవసరమన్నారు. కొన్నిసార్లు సెకండరీ బోన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ 12 నెలలు తరువాత అవసరమవుతుందన్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు: కలెక్టర్

మహారాణిపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మార్చి 1 నుంచి 20 వరకు జరిగే ఇంటర్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు, శుక్రవారం ఆయన తన కార్యాలయంలో ఇంటర్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ థియరీ, ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణలో ఎటువంటి పొరపాట్లుకు తావులేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎక్కడ ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు, పరీక్ష కేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరాదని చెప్పారు. ఈనెల 10 నుంచి 20 వరకు జరిగే ద్వితీయ సంవత్సరం థియరీ పరీక్షలకు 153 కేంద్రాల్లో 40,622 మంది హాజరుకానున్నట్టు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని, 200 మీటర్ల దూరంలో ఫొటో, జెరాక్సు దుకాణాలను మూసివేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్ఐవో మురళీధర్, డీవీఈవో రాధ, తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణలో లోపాలు కూడదు

మద్దిలపాలెం: ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణలో ఎటువంటి లోపాలు ఉండకూడదని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా ఆదేశించారు. ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్, థియరీ పరీక్షలపై శుక్రవారం ఆమె జిల్లా బోర్డు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పూర్తిస్థాయి వసతులు కల్పించాలని సూచించారు. మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా సీసీ కెమెరాలు, స్క్వాడ్ పర్యవేక్షణ ఉండాలన్నారు. పరీక్షల విధుల్లో అధికారులు, సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సెల్‌ఫోన్లపై నిషేధం

పరీక్ష కేంద్రాల్లో ఇన్విజిలేటర్లు, విద్యార్థుల సెల్‌ఫోన్లు అనుమతించే అవకాశం లేదని, ఎవరి వద్ద అయినా ఫోన్లు లభిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో పరీక్షల నిర్వహణకు జరుగుతున్న ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాన్ఫరెన్స్‌లో ఆర్ఐవో మురళీధర్, డెక్ సభ్యులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం... crime news

సముద్రంలో యువకుడి గల్లంతు



నిఖిల్ (ఫైల్)

మహారాణిపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సరదాగా స్నేహితులతో బీచ్‌కు వచ్చి సముద్రంలో స్నానానికి దిగి యువకుడు గల్లంతయ్యాడు. గాజువాకకి చెందిన రౌల నిఖిల్ తన స్నేహి తులు 11 మందితో కలిసి శుక్రవారం ఆర్‌కే బీచ్‌కు వచ్చారు. వారిలో ఐదుగురు మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో సముద్రంలో స్నానానికి దిగారు. కెరటాల ఉధృతికి అందరూ లోపలికి వెళ్లిపోయారు. అందులో నలుగురు బయటపడగా, నిఖిల్ ఆచూకీ లభించలేదు. సమాచారం అందడంతో పోలీసులు, గజ ఈత గాళ్లు, కోస్టుగార్డు సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి వరకు నిఖిల్ ఆచూకీ లభించలేదు. అతడి తల్లిదండ్రులు శశాంక్, విజయలక్ష్మి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

వరకట్నం వేధింపులపై కేసు నమోదు

ఎంవీపీ కాలనీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం చేసి, ఆ తరువాత వివాహం చేసుకున్న యువకుడు వరకట్న వేధింపులకు గురిచేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీకాకుళం జిల్లా, పొందూరు స్టేషన్‌లో నమోదైన జీరో ఎఫ్ఐఆర్‌ను ఎంవీపీ స్టేషన్‌కు బదిలీచేశారు. ఈ మేరకు యువతి నుంచి ఫిర్యాదు తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పొందూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక 2023లో విశాఖ ఇసుకతోటలో కొన్నాళ్లు నివాసముండేది. ఈ సందర్భంగా విజయనగరం జిల్లా గంట్యాడ మండలం, నీలావతి గ్రామానికి చెందిన పెనగంటి శివ (19) బాలికను మాయమాటలతో లోబరుచుకున్నాడు. కాగా ఆమె మేజర్ అయిన తర్వాత పెద్దలు ఇద్దరికీ వివాహం జరిపించారు. అనంతరం శివ, అతని కుటుంబ సభ్యులు వరకట్నం వేధింపులకు గురిచేయడంతో పొందూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే ఘటన విశాఖలో జరగడంతో ఎంవీపీ స్టేషన్‌కు బదిలీ చేశారు. నిందితుడిపై పోక్సో చట్టంతో పాటు వరకట్న వేధింపుల చట్టం 498ఏ కేసును నమోదు చేసి, సీఐ మురళి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

ఎంవీపీ కాలనీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మద్దిలపాలెం, ఆటోమోటివ్ కూడలి సమీపంలోని ఓ ఇంట్లో వ్యభిచారం జరుగుతోందన్న సమాచారం మేరకు ఎంవీపీ సీఐ మురళి, సిబ్బంది, టాస్క్ ఫోర్స్ సిబ్బందితో కలసి దాడి చేశారు. మద్దిలపాలెం వెంపాడ వీధికి చెందిన సంజీవి సంతోష్ కుమార్, పెందుర్తికి చెందిన పసుపురెడ్డి కుమార్ (27)లను అరెస్టు చేశారు.

ఏటీఎం చోరీ యత్నం కేసులో నిందితుడి అరెస్టు

కంచరపాలెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మధురవాడ ప్రాంతంలో గురువారం వేకువజామున ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ చేసేందుకు యత్నించిన నిందితుడ్ని పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను క్రైం ఏడీసీపీ మోహనరావు శుక్రవారం వెల్లడించారు. గతంలో ఓ నేరంలో నిందితుడైన మాధవధార ప్రాంతానికి చెందిన పైడి సంతోష్ మధురవాడ ఏటీఎంలో దొంగతనానికి ప్రయత్నించి, మెషీన్ తెరుచుకోకపోవడంతో పరారయ్యాడు. స్థానికుల ఫిర్యాదుమేరకు పోలీసులు సీసీ టీవీ ఫుటేజీ పరిశీలించి సంతోష్‌ను అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో క్రైం సీఐ నిమ్మకాయల శ్రీనివాసరావు, ఎస్ఐ సూర్యనారాయణ పాల్గొన్నారు.

డీఎల్ఈడీ పరీక్ష ఫీజు చెల్లింపునకు 4 వరకు గడువు

ఆరిలోవ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఎల్ఈడీ) 2023-25 మూడో సెమిస్టర్ పరీక్షలకు హాజరయ్యే రెగ్యులర్, కంపార్ట్‌మెంటల్ అభ్యర్థులు రూ.50 ఆలస్య రుసుంతో ఈ నెల 4వ తేదీలోగా ఆయా కళాశాలల్లో ఫీజు చెల్లించాలని జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు అన్నిపరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు రూ.250, 4 నుంచి 6 సబ్జెక్టులకు రూ.250, మూడు సబ్జెక్టులకు రూ.175, రెండు సబ్జెక్టులకు రూ.150తో, ఒక సబ్జెక్టుకు రూ.125తో పాటు ఆలస్య రుసుం రూ.50 కలిపి చెల్లించాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

'కేసుల పరిష్కారంలో మధ్యవర్తుల పాత్ర కీలకం'

విశాఖపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసుల పరిష్కారంలో మధ్యవర్తుల పాత్ర కీలకమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ పేర్కొన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో ఐదు రోజుల పాటు జరిగిన మధ్య వర్తిత్వంపై శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. శిక్షణలో నేర్చుకున్న మెలకువలను కేసుల పరిష్కారంలో వినియోగించాలని న్యాయవాదులను కోరారు. చెన్నై నుంచి వచ్చిన జాతీయ శిక్షకులు సత్యారావు, రత్నతారలను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఐవోఈ హోదాకు ప్రణాళికలు

» ఏయూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ శశిభూషణరావు



శివ ప్రకాష్‌ను సత్కరిస్తున్న ఏయూ వీసీ

విశాఖపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ (ఐవోఈ) స్థానానికి పోటీపడేందుకు ఆంధ్ర విశ్వవిద్యాలయం సిద్ధమవుతోందని ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు పేర్కొన్నారు. బెంగళూరు ఐఐఎస్‌సీకి చెందిన ప్రొఫెసర్ శివప్రకాశ్ శుక్రవారం ఏయూను సందర్శించారు. ఈ సందర్భంగా ఫలితాల ఆధారిత విద్య, జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)తో సహా వివిధ అంశాలపై చర్చించారు. ఇప్పటివరకు ఐఐటీలు, మూడు ప్రైవేటు విశ్వవిద్యాలయాలు హోదాను పొందాయన్నారు. నూతన విద్యా విధానానికి అనుగుణంగా ఐవోఈ దరఖాస్తు ప్రక్రియ, ఫలితా ల ఆధారిత విద్యఅమలుపై వచ్చేనెల 22న వర్క్‌షాప్ నిర్వహిస్తామన్నారు.

కుంభమేళాలో 30 మంది కాదు...300 మంది చనిపోయారు

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్



మాట్లాడుతున్న కేఏ పాల్

విశాఖపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కుంభమేళాలో 30 మంది చనిపోయారని జాతీయ పత్రికలు రాస్తున్నాయని, కానీ అక్కడ 300 మంది మరణించారని, ఆ వాస్తవాలు మీడియాలో రావడం లేదని ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ఆరోపించారు. కేఏ పాల్ ఫంక్షన్ హాలులో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. స్టీల్‌ప్లాంటుకు కేంద్రం సాయంగా ప్రకటించిన రూ.11,440 కోట్లు అప్పులు తీర్చడానికే ఉపయోగపడతాయన్నారు. ఇంకో మూడు నెలలు జీతాలు ఇవ్వలేమని మంత్రి కుమారస్వామి చెప్పడం సరి కాదన్నారు. స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా గురించి చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు మాట్లాడడం లేదన్నారు. అన్నయ్యలు చిరంజీవికి కేంద్ర మంత్రి పదవి, నాగబాబుకు రాష్ట్ర మంత్రి పదవి ఇప్పించడానికి పవన్ కల్యాణ్ ప్రయత్నం చేస్తున్నారన్నారు. 2026లో జమిలి ఎన్నికలు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రజలకు ద్రోహం చేసిన పార్టీలన్నీ ఆ ఎన్నికల్లో ఓడిపోతాయన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు కావడం లేదని ఆరోపించారు.

వీఎంఆర్‌డీఏలో నీతిఆయోగ్ సమావేశం



సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

విశాఖపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో శుక్రవారం నీతి ఆయోగ్ ప్రధాన ప్రగతి చోదకాలైన ఆక్వా, ఔషధ, ఉక్కు, పెట్రోకెమికల్స్ రంగాలపై సమావేశం జరిగింది. నీతి ఆయోగ్ కార్యనిర్వహణాధికారి సుబ్రహ్మణ్యం, సభ్యులు ఎస్.కిశోర్, కలెక్టర్ హరేంధిరప్రసాద్, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, గిరిజన సహకార సంస్థ ఎండీ కల్పనా కుమారి, వీఎంఆర్డీఏ కమిషనర్, నీతి ఆయోగ్ నోడల్ అధికారి కేఎస్ విశ్వనాథన్, ఇనిస్టిట్యూట్ ఫర్ సస్టైనబిలిటీ ఎంప్లాయిమెంట్ అండ్ గ్రోత్ ప్రతినిధి శిరీష్‌శాంకే పాల్గొన్నారు. స్థానిక వనరులు, అభివృద్ధికి అవకాశం ఉన్న రంగాలపై చర్చించారు. ఈ సమావేశంలో జాయింట్ కమిషనర్ రమేష్, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంపై ఫిర్యాదు

ఆరిలోవ, జనవరి31 (ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్ష్యంతోనే రోడి మృతిచెందాడని అతడి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. నగరంలో గోపాలపట్నానికి చెందిన డెక్క కృష్ణ (34) కిడ్నీ సమస్యకు హెల్త్ సిటీలోని ఓ ఆస్పత్రిలో మంగళవారం చికిత్స చేశారు. అయితే అతడి పరిస్థితి విషమించడంతో వెంటనే ఆయుష్ వైద్యశాలకు తరలించారు. అక్కడ వెంటిలేటర్‌పై చికిత్స చేస్తుండగా శుక్రవారం ఉదయం 11 గంటలకు మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. అయితే కృష్ణ మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని అతడి బంధువులు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కృష్ణ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. కృష్ణకు భార్య రామలక్ష్మి, ఇద్దరు కుమారులున్నారు. నగరంలోని షాపింగ్ మాల్‌లో సేల్స్‌మన్‌గా పనిచేస్తున్నాడని, అతడి మృతితో కుటుంబం అనాథగా మారిపోయిందన్నారు.